
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య

జిల్లా వార్తలు

5

గురువారం 7 ఆగస్టు 2025



చెరువులోకి కలుస్తున్న మురుగు నీటి కాలువలు

దశాబ్దం క్రితం వరకు పీలేరుతో పాటు పరిసర ప్రాంతాలకు తాగు, సాగు నీటి అవసరాలు తీర్చిన పీలేరు అయ్యపనాయుని చెరువు నేడు మురుగు కూపంలా మారిపోయింది. దుర్గంధం వెదజల్లుతూ తనను పునరుద్ధరించే నాథుడి కోసం ఎదురు చూస్తోంది. ఈ చెరువును చూసిన వారంతా అయ్యో.. ఎలా ఉండే చెరువు.. ఎలా మారింది.. అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఈ చెరువును అభివృద్ధి పరుస్తామని అసత్య హామీలిచ్చిన వైసీపీ నాయకులు ఏమీ చేయలేదు.. కూటమి ప్రభుత్వంలోనైనా చెరువు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అయ్యో పనాయుని చెరువు..!

ఒకప్పుడు మంచినీటి వనరు, నేడు మురికికూపం

- చెరువులో కలుస్తున్న మురుగు నీరు
- ఐదేళ్లూ అబద్ధాలతో సరిపుచ్చిన వైసీపీ నాయకులు
- పూర్వ వైభవం తేవాలంటున్న స్థానికులు



అధ్వాన స్థితిలో ఉన్న సర్కారు బావి నీరు

పీలేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణానికి ఆనుకుని ఉన్న అయ్యపనాయుని చెరువు 59.50 ఎకరాల విస్తీర్ణం, 250 ఎకరాల సాగుబడి కలిగి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అతి పెద్ద నీటి వనరుల్లో ఒకటి. చెరువు కింద ఆయకట్టు కలిగిన రైతులు పీలేరుకు ఆనుకుని ప్రవహిస్తున్న పింఛా నది ద్వారా కాలువల ద్వారా నీటిని మళ్లించి చెరువును నింపుకునేవారు. తద్వారా ఆ నీటిని పట్టణ అవసరాలకు గ్రామ పంచాయతీ ద్వారా వినియోగించుకునేవారు. చెరువుకు అనుసంధానంగా ఉన్న సర్కారు బావి ద్వారా పట్టణ ప్రజలకు కొళాయిల ద్వారా పంచాయతీ అధికారులు నీరు సరఫరా చేసేవారు. సగం పీలేరు పట్టణానికి సర్కారు బావి ద్వారా నీరు సరఫరా అయ్యేది. కాలక్రమంలో పీలేరు పట్టణం అభివృద్ధి చెందిన కొద్దీ అయ్యపనాయుని చెరువుకు కష్టాలు మొదలయ్యాయి. పట్టణంలోని మురుగునంతటినీ చెరువులోకి వదిలేయడం ప్రారంభం కావడంతో ప్రజలు ఆ నీటిని వినియోగించడం మానేశారు. 2001లో వచ్చిన కరువు తరువాత చెరువు ఆయకట్టుదారులు కూడా క్రమక్రమంగా వ్యవసాయానికి దూరం కావడం, సాగు భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోవడంతో రైతులు కూడా చెరువుకు నీళ్లు కట్టడం మరిచిపోయారు. దీంతో పాలకులు కూడా దాని బాగోగులు పట్టించుకోవడం మానేశారు. ఇక సామాన్యులు, చికెన్, మటన్ వ్యాపారులు తమ ఇళ్లు, దుకాణాల చెత్త, వ్యర్థాలను చెరువులో డంప్ చేసేయడం, భవన నిర్మాణ రంగంలోని వ్యర్థాలను సైతం చెరువులో కలిపేయడంతో దాని రూపు రేఖలు మారిపోయాయి. ఇక చెరువు చుట్టూ ఉన్న భూముల్లో వెలసిన వెంచర్ల కారణంగా చెరువుకు సంబంధించిన దాదాపు 10 ఎకరాల భూమి కూడా అన్యాక్రాంతమైంది.

కల్లగా వైసీపీ నాయకుల హామీలు

అయ్యపనాయుని చెరువును పునరుద్ధరించి దానికి అందమైన రూపునిస్తామని 2014, 2019 ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు అనేక హామీలు గుప్పించారు. 2019లో వారి ప్రభుత్వం కొలువైన తరువాత రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పలుమార్లు చెరువు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ప్రకటనలు కూడా చేశారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న చెరువు తరహాలో పీలేరు చెరువును కూడా ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కుగా మలుస్తామని, అందుకు రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు చేపడతామని వారు గుప్పించిన హామీలు కల్లలుగానే మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా చెరువును అభివృద్ధి చేయాలని, పట్టణంలోని మురుగునీరు అందులో కలవకుండా ప్రణాళికలు రూపొందించాలని ప్రజలు కోరుతున్నారు.



పీలేరు అయ్యపనాయుని చెరువు



పిచ్చి మొక్కలతో నిండిపోయిన చెరువు

పునరుద్ధరిస్తే నీటి కష్టాలు తీరినట్టే

అయ్యపనాయుని చెరువును తిరిగి మంచినీటి వనరుగా పునరుద్ధరిస్తే పీలేరు పట్టణ ప్రజల నీటి కష్టాలు శాశ్వతంగా తీరినట్టే. ప్రస్తుతం పట్టణానికి దక్షిణ వైపున ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు తోడుగా అయ్యపనాయుని చెరువు కలిస్తే ఎంతటి వేసవినైనా దీటుగా ఎదుర్కోవచ్చని పలువురు విశ్రాంత ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అనేక సాంకేతిక అంశాలు అందుబాటులోకి వచ్చాయని, ప్రభుత్వం, స్థానిక పాలకులు దృష్టి సారిస్తే చెరువును కాపాడుకోవచ్చని వారు తెలిపారు.

రూ.1.41 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

అయ్యపనాయుని చెరువు రీస్టోరేషన్, రిపేర్స్, రెనోవేషన్ కోసం రూ.1.41 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అవి మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. చెరువు ప్రాధాన్యతను ప్రభుత్వానికి నివేదిక రూపంలో తెలియజేశాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

● ఝాన్సీ, ఏఈఈ, ఇరిగేషన్ శాఖ

అయ్యపనాయుని చెరువును అభివృద్ధి చేయాలి



మా చెరువును అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలి. గతంలో మంచి నీళ్లతో ఉండే చెరువు నేడు మురుగునీటితో ఉండడం చూస్తే బాధగా ఉంది. నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సహకారం కోరతాం.

● హరిప్రసాద్, సాగునీటి సంఘం అధ్యక్షుడు

మురుగునీరు కలవకుండా చర్యలు చేపట్టాలి



అయ్యపనాయుని చెరువులోకి పట్టణ మురుగు నీరు కలవకుండా చర్యలు చేపట్టాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి కాలువల ద్వారా వస్తున్న మురుగునీరు చెరువులోకి కాకుండా పింఛా నదిలో కలిసేలా చేయాలి. అప్పుడే చెరువును కాపాడగలం.

● చంద్రశేఖరరెడ్డి, న్యాయవాది, బీజేపీ నాయకుడు

ఊరికే.. బస్సు 6

హార్సిలీహిల్స్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

ఆస్తులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు ● కలెక్టర్ చామకూరి శ్రీధర్



హరితసర్కిల్‌లో వాటర్ ఫౌంటెన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, పక్కన జేసీ, సబ్ కలెక్టర్

బి.కొత్తకోట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పర్యాటకరంగాన్ని అమాంతం అభివృద్ధి చేసి, ఆదాయాన్ని పెంచుకోవాలన్న సీఎం చంద్రబాబు ఆలోచనలో భాగంగా ఆంధ్రా ఊటీ గా పేరుగాంచిన సుందరప్రదేశం హార్సిలీ హిల్స్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, మదనపల్లి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌లతో కలిసి బుధవారం బి.కొత్తకోట మండల పరిధిలోని హార్సిలీ హిల్స్‌లో ఆయన పర్యటించారు. టౌన్‌షిప్ కమిటీ, పీకేఎం (పలమనేరు-మదనపల్లె-కుప్పం) ఉడా నిధులతో హిల్స్‌లోని ప్రధానకూడళ్లలో చేపట్టిన సుందరీకరణ పనులను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. హిల్స్ ముఖద్వారంలో వెల్కంబోర్డు, హరితసర్కిల్‌లో వాటర్ ఫౌంటెన్, వివేకానంద విగ్రహం, జిడ్డుక్రిష్ణమూర్తి సర్కిల్, గాలిబండపై నిర్మించిన ఐలవ్ హార్సి లీహిల్స్ ఐకాన్‌లను పరిశీలించారు. ఇంకా చేపట్టాల్సిన నిర్మాణాలపై సూచనలిచ్చారు. రెవెన్యూ అతిథిగృహంగా రూ.80 లక్షల వ్యయంతో నిర్మితమై ప్రస్తుతం రెవెన్యూ భాగస్వామ్యంతో ఆధునిక హంగులతో రూపు దిద్దుకున్న బ్రీజోరా రెస్టారెంట్‌ను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌ను పర్యాటకులను ఆకర్షించే విధంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేయబోతున్నామన్నారు. హిల్స్ పర్యటనకు వచ్చే పర్యాటకులు బహిరంగంగా మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, ఇతర పర్యాటకులకు ఇబ్బంది కలిగించడం లాంటి పనులు చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. హిల్స్‌కు తలమానికంగా ఊహిస్తున్న ఒబెరా య్ హోటల్ నిర్మాణంపై ఆ సంస్థ తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. ఇక పతంజలి సంస్థ ఏర్పాటు చేయబోయే వెల్నెస్ సెంటర్ వ్యవహారం ఏపీ టూరిజంశాఖ చూస్తోందని పేర్కొన్నారు. ఆయన వెంట బి.కొత్తకోట తహసీల్దార్ బావాజాన్, ఎంపీడీవో క్రిష్ణవేణి, వీఆర్వో జయరాం తదితరులున్నారు.

బ్యాలెట్ బాక్సులపై శిక్షణ



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ

కడప కలెక్టరేట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులకు బ్యాలెట్ బాక్సుల వినియోగంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని జడ్పీ సీఈవో, రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రిసైడింగ్ అధికారులకు, ఏపీవోలకు బ్యాలెట్ బాక్సుల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వెంకటపతి, ఒంటిమిట్ట అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రంగస్వామి, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు విజయలక్ష్మి, రామాంజనేయులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

పలువురు సీఐల బదిలీ

కడప క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీచేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్లు తక్షణమే వారికి కేటాయించిన పోలీసుస్టేషన్లలో బాధ్యతలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

సీఐ	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం
సుబ్బారావు	ఆదోని, ట్రాఫిక్	వీఆర్, కడప
ఎన్.క్రిష్ణయ్య	డీసీఆర్‌బీ, నంద్యాల	వీఆర్, కడప
నరేశ్‌బాబు	ఎర్రగుంట్ల	జమ్మలమడుగు
లింగప్ప	జమ్మలమడుగు	బద్వేలు
రాజగోపాల్	బద్వేలు	ప్రొద్దుటూరు, ట్రాఫిక్
విశ్వనాథరెడ్డి	రాయచోటి ట్రాఫిక్	ఎర్రగుంట్ల
సురేశ్‌రెడ్డి	వీఆర్, కడప	సైబర్‌సెల్, కడప
పి.రాజ	రాజంపేట	కొండాపురం సర్కిల్
మహ్మద్‌రఫి	కొండాపురం సర్కిల్	మదనపల్లె వన్‌టౌన్
నాగార్జున	వీఆర్, కడప	రాజంపేట
కుళాయప్ప	మన్నూరు	రాయచోటి ట్రాఫిక్
ప్రసాద్‌బాబు	వాయల్పాడు	మన్నూరు
అనిల్‌కుమార్	కలకడ	కలికిరి
రాఘవరెడ్డి	ఆర్ఎస్‌పీఎఫ్ అన్నమయ్య	వాయల్పాడు
లక్ష్మన్న	మొలకలచెరువు	కలకడ
వెంకటేశ్వర్లు	వీఆర్, తిరుపతి	మొలకలచెరువు
చంద్రశేఖర్	వీఆర్, అన్నమయ్య	ఆర్టీఎఫ్ అన్నమయ్య
జె.గంగనాథబాబు	బి.కొత్తకోట	వీఆర్ నంద్యాల
గోపాల్‌రెడ్డి	వీఆర్, కడప	బి.కొత్తకోట
రాజారెడ్డి	ఎస్బీ3, అన్నమయ్య	మదనపల్లె టూటౌన్
రామచంద్ర	మదనపల్లె టూటౌన్	ఆర్ఎస్‌పీ ఎస్టీఎఫ్, అన్నమయ్య
తిమ్మారెడ్డి	వీఆర్, అన్నమయ్య	ఎస్బీ3, అన్నమయ్య
మోహనకుమార్	ఉమెన్ పీఎస్, అన్నమయ్య	వీఆర్, అన్నమయ్య
గురునాథ్	వీఆర్, కడప	ఉమెన్ పీఎస్, అన్నమయ్య

300 ఎకరాల భూ కేటాయింపులు

● గండికోటలో 50 ఎకరాల్లో ఒబేరాయ్ విల్లాలు

కడప కలెక్టరేట్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. కూటమి సర్కారు కొలువుదీరిన నాటి నుంచి జిల్లాలో పలు ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించి దాదాపు 300 ఎకరాల భూ కేటాయింపులు చేస్తూ భవిష్యత్తు తరాలకు బంగారుబాటలు వేస్తోంది. జమ్మలమడుగు మండలం దిగువపట్నంలో గండికోట ఇంటిగ్రేటెడ్ టూరిజం ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రత్యేక దృష్టి సారించారు. గండికోటలో ఆధునాతమైన భవనాలు, విల్లాలు కట్టించి పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేలా సకల సౌకర్యాలు కల్పించనున్నారు. ఆ దిశగా దేశంలో పేరుమోసిన ఒబేరాయ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అక్కడ పర్యాటకులను ఆకట్టుకునేలా విల్లాలు నిర్మించేందుకు గాను ఒబేరాయ్ యాజమాన్య సంస్థ ముందుకు రావడంతో, రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాల కేటాయింపులకు ఉత్తర్వులు జారీచేసింది. అంతేకాకుండా అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ విద్యుత్ ప్రాజెక్టుకు జమ్మలమడుగులోని కె.భూమాయపల్లిలో 41.99 ఎకరాలను లీజుకు కేటాయించనున్నారు. ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటే పంప్‌డ్ స్టోరేజ్ (పీఎస్) ద్వారా దాదాపు 1000 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. కాగా.. 41.99 ఎకరాలలో విద్యుత్ ఉత్పాదన సాధ్యం కాదని భావించిన అదానీ సంస్థ మరో 191.64 ఎకరాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టింది. దీనికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మార్కెట్ ధరలకు అనుగుణంగా రైతుల నుంచి ఎకరం రూ.5 లక్షలతో కొనుగోలు చేసేందుకు అదానీ సంస్థ ముందుకు వచ్చినట్లు సమాచారం. పీఎస్ ప్రాజెక్టు కింద 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదకత, గండికోట వద్ద ఒబేరాయ్ సంస్థ విల్లాలు పూర్తిచేస్తే జిల్లాలో మరింత మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.

ప్రిన్సిపాల్ వేధింపులతో..

ఉపాధ్యాయురాలికి తీవ్ర అనారోగ్యం 6

సబ్‌కలెక్టర్‌గా భావన బాధ్యతలు



బాధ్యతలు చేపట్టిన సబ్‌కలెక్టర్ భావన

రాజంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట సబ్‌కలెక్టర్‌గా హెచ్ఎస్ భావన బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న వైఖోం నిదియాదేవిని ప్రభుత్వం బదిలీ చేయడంతో హెచ్ఎస్ భావన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, డివిజన్‌లోని పలువురు రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వేదపండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు నూతన సబ్‌కలెక్టర్‌ను పరిచయం చేసుకున్నారు. అనంతరం రాయచోటికి వెళ్లి కలెక్టర్ శ్రీధర్ చామకూరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎంఈఓ-1 నియామకాల్లో గందరగోళం

- పీఆర్ ఉపాధ్యాయులకు అన్యాయం
- ఉపాధ్యాయవర్గాల్లో ఆందోళన

ఎంఈఓ-1 నియామకాల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఉండగా స్కూల్ అసిస్టెంట్‌లతో ఎంఈఓ-1 పోస్టులు భర్తీ చేయడం పట్ల ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్ర అభ్యంతర వ్యక్తం చేస్తున్నారు. ఒక గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఒక స్కూల్ అసిస్టెంట్ స్థాయి ఉపాధ్యాయుని కింద ఎలా పనిచేయాలని ప్రశ్నిస్తున్నారు. పంచాయతీరాజ్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని అంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 98శాతంగా ఉన్న పీఆర్ ఉపాధ్యాయులను కాదని కేవలం 3శాతం కూడా లేని ప్రభుత్వ ఉపాధ్యాయులకు డీవైఈఓ, ఎంఈఓ-1 వంటి పోస్టులు కట్టబెట్టడం తగదని అంటున్నారు.

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకునే నిర్ణయం వల్ల వేలాది మంది పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పరీక్ష ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు అత్యధికంగా ఉన్నందున ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయడంలో ఎలాంటి న్యాయ అడ్డంకులు లేవని చెబుతున్నారు. ఒకే విద్యార్హతలో, ఒకే శిక్షణలో ఒకే జీత భత్యాలతో ఒకే ప్రభుత్వం కింద (ప్రభుత్వ, పంచాయతీరాజ్) పనిచేస్తున్నప్పటికి తమకు అన్యాయం జరుగుతోందని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీనియర్లను పక్కనపెట్టి

సీనియర్ ఉపాధ్యాయులను ఎంఈఓ-2గా నియమించి సర్వీస్‌లో ఎంతో జూనియర్లయిన ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓ-1గా నియమించడం వల్ల మెజారిటీ పీఆర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందని అంటున్నారు. ఎంఈఓ-1 ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వవద్దని 2024లో కోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు చెబుతున్నారు. దీనికి సంబంధించి స్టేటస్‌కో అమల్లో ఉంది. ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు ఇరువురికి ప్రస్తుతానికి ఇవ్వవద్దని ఉత్తర్వులు ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఎంఈఓ-1, డీవైఈవో పదవులు ప్రభుత్వ ఉపాధ్యాయులకే కట్టబెడుతున్నారు. కోర్టు తీర్పు ప్రకారం స్టేటస్‌కో అమలు చేయాలి. రాష్ట్రంలో 98శాతం ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయులను కూడా ఎంఈఓ-1, డీవైఈవో స్థానాల్లో నియమించాలని పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.



ఉమ్మడి సీనియారిటీ ప్రకారం భర్తీ చేయాలి



1986 మండల పరిషత్ వ్యవస్థ రావడంతో ఎంఈవో పోస్టులు ఏర్పాటయ్యాయి. ఈ పోస్టులకు 1998 నుంచి జిల్లా పరిషత్ మరియు ప్రభుత్వ ఉపాధ్యాయులతో కూడిన ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన భర్తీ చేసేవారు. ప్రభుత్వం 72, 73, 74 జీఓల ప్రాతిపదికన ప్రభుత్వ మరియు జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలి. దానికి విరుద్ధంగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో పాఠశాల సహాయకులతో ఎంఈవో పోస్టులు భర్తీ చేయడం పూర్తిగా అసంబద్ధం. ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికగా ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలి.?

- వెంకటసుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకే కేటాయించాలి



ఎంఈవో అనేది గెజిటెడ్ ఆఫీసర్ పనిచేయాల్సిన స్థానం. దానిని ఒక స్కూల్ అసిస్టెంట్‌కు కేటాయించడం తగదు. ఎంఈవో-2 గెజిటెడ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఎంఈవో-1 ఒక స్కూల్ అసిస్టెంట్ పనిచేయడం విడ్డూరం. దీనిని వెంటనే సవరించి ఉత్తర్వులు ఇవ్వాలి. ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు లేనప్పుడు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులకు ఇవ్వడం సమంజసం. అలా కాకుండా ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల మధ్య తగువు పెంచడం సబబు కాదు. చర్చల ద్వారా వీరి మధ్య సమన్వయం కుదిర్చి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు మాత్రమే ఎంఈవో పోస్టులు ఇవ్వడం న్యాయబద్ధం.

- కె.శ్రీనివాసరాజు, ఎన్టీయే రాష్ట్ర అధ్యక్షుడు

ఉమ్మడి సీనియారిటీ ఆధారంగా భర్తీచేయాలి



సీనియర్లు అయిన పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులను ఎంఈఓ-2గా నియమించి, జూనియర్‌లైన ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓ-1గా నియమిస్తున్నారు. సబ్జెక్టులు బోధించాల్సిన స్కూల్ అసిస్టెంట్లకు ఎంఈఓ-1గా అదనపు బాధ్యతలు కట్టబెట్టడం ద్వారా బడికి దూరం చేస్తే ఆ పాఠశాలల్లో ఆయా సబ్జెక్టులు ఎవరు బోధిస్తారు? ఆ పిల్లల విద్యా ప్రమాణాలు ఎలా పెరుగుతాయి? కనుక ప్రభుత్వ, పంచాయతీరాజ్ యాజమాన్యాలలోని ఉపాధ్యాయుల ఉమ్మడి సీనియారిటీ ఆధారంగా ఎంఈఓ-1 పోస్టులను భర్తీ చేయాలి.

- మల్లు రఘునాథరెడ్డి, ఎస్టీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి

ఉరి వేసుకుని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య


విద్యార్థి (ఫైల్‌ఫొటో)

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 6: బీటెక్ చదువుతున్న విద్యార్థి ఇంట్లోనే సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకుని మృతిచెందిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, చౌడేశ్వరి కూడలికి చెందిన సుధాకర్ కుమార్తె రెడ్డిశ్రావణి(21) పులివెందులలో బీటెక్ రెండో ఏడాది చదువుతోంది. సెలవులకు గత శని వారం మదనపల్లెకు వచ్చింది. బుధవారం తండ్రితో కలిసి గుడికి వెళ్లి ఇంటికి వచ్చిన తరువాత ఇంట్లోనే ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. తండ్రి చేనేత మగ్గం నేస్తుండగా తల్లి ఐదేళ్ల కిందట చనిపోయినట్లు తెలిపారు. కాగా సూసైడ్ నోట్‌లో 'నేను ఇక చదవలేనని' రాసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..


అబ్దుల్ రహీమాన్ మృతదేహం

కలకడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ బస్టాండు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అబ్దుల్ రహీమాన్(50) మృతి చెందినట్లు హెచ్‌సీ హరిబాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కలికిరి మండలం మేడికుర్తికి చెందిన అబ్దుల్‌రహీమాన్ భవన నిర్మాణ మేస్త్రీగా పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. కలకడలో ఓ పని కోసం కూలీలను సమకూర్చుకోవడానికి బాటవారిపల్లెకు నడుచుకొని వెళుతుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రహీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన కానిస్టేబుల్ రాఘవ, సోమశేఖర్

సిద్దవటం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లె గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాఘవ అనే కానిస్టేబుల్ మాధవరం నుంచి ద్విచక్ర వాహనంలో విధులకు వెళుతున్నాడు. అదేసమయంలో మిట్టపల్లెకు చెందిన సోమశేఖర్ ఎదురుగా రావడంతో రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్‌ను స్థానికులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. స్థానిక ప్రైవేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం సోమశేఖర్‌ను కూడా రిమ్స్‌కు తరలించారు ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఇద్దరు స్మగ్లర్లు పరార్ • కారు స్వాధీనం


పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలు, కారుతో ఫారెస్టు అధికారులు

సుండుపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సుండుపల్లె బీట్‌లోని సద్దికూలవంక చెక్‌పోస్ట్ వద్ద నాకాబందీ నిర్వహిస్తుండగా వేగంగా వచ్చిన ఒక కారు బారికేడ్ ఉన్న విషయాన్ని గుర్తించి సుండుపల్లె రహదారిలో పరారయ్యేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గ్రహించిన ఫారెస్టు అధికారులు, సిబ్బంది వెంబడించగా స్మగ్లర్లు కారును వదిలేసి పరారయ్యారన్నారు. ఈ కారులో 326 కిలోల బరువున్న 10 ఎర్రచందనం దుంగలను గుర్తించామన్నారు. దుంగలతో పాటు కారు విలువ రూ.6 లక్షలుంటుందని, ఈ దాడిలో పరారైన వారి కోసం తనిఖీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో రమేశ్‌బాబు, ఎఫ్‌బీవో అంజనస్వాతి, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో పాడి ఆవు మృతి

వాల్మీకిపురం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): స్థానిక నమాజ్‌కట్ట వీధికి చెందిన రెడ్డిబాషా, అమ్మాజి దంపతులు కూలి జీవనంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 8నెల ల కిందట రూ.50వేలు ఖర్చు చేసి ఓ పాడి ఆవును తెచ్చుని జీవిస్తున్నారు. రోజూ 15లీటర్లు పాలిచ్చే ఆవు మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా మృతి చెందింది. ఆ కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉండే ఆవు మృతి చెందడంతో వారు కన్నీటి పర్యంతమన్నారు. ప్రభుత్వం తమకు కనీస సాయం అందించాలని కోరుతున్నారు.

ఊరికే.. బస్సు

- రాష్ట్రం పరిధిలోనే మహిళలకు ఉచిత ప్రయాణం
- కొన్ని రకాల గుర్తింపు కార్డులే చెల్లుబాటు
- పథకానికి స్త్రీశక్తి పేరుగా ప్రచారం
- మహిళల కబుర్లలో ఆసక్తికర చర్చలు



కలికిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకంపై సర్వత్రా చర్చలు జరుగుతున్నాయి. నలుగురు మహిళలు ఒకచోట కూడితే వారి కబుర్లలో ప్రధానంగా ఇదే అంశం చర్చకు వస్తోంది. ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. సూపర్ సిక్స్‌కు సంబంధించిన టీడీపీ ఎన్నికల హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఒకటి. దీని అమల్లో ఎక్కడా గందరగోళం తలెత్తకుండా ఆర్టీసీ అధికారులు కూడా పలు రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కేరళ, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణాల్లో ఈ పథకం అమల్లో ఉంది. ఏడాది కాలంగా ఈ రాష్ట్రాల్లో అమలవుతున్న తీరుతెన్నులు, సాధక బాధకాల గురించి ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేయించి ఆచితూచి అడుగు లేస్తోంది.

సమాయత్తమవుతున్న ఆర్టీసీ

మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలు తేదీ దగ్గరపడే కొద్దీ ప్రధానంగా ఆర్టీసీలో హడావిడి మొదలైంది. మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులు, జోన్‌లు, రీజియన్ల వారీగా సమావేశాలు నిర్వహించి స్థానిక పరిస్థితులకు అనువుగా ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారు. క్షేత్ర స్థాయి అంచనాలను, ఎదురయ్యే అనుభవాలను విశ్లేషిస్తున్నారు. అన్ని డిపోల్లో కొత్త బస్సులు సమకూర్చేందుకు సమాయత్తం అవుతున్నారు. డిపోల్లో పక్కన పెట్టిన బస్సులను అవసరమైన మరమ్మతులతో సిద్ధం చేస్తున్నారు. కొన్ని మార్గాల్లో రద్దీకి అనుగుణంగా ఇప్పుడున్న సీట్లను మారుస్తున్నారు. మూడు వరుసల సీట్లు తొలగించి నిలుచోవడానికి అనువుగా రెండు సీట్లతో వరుసలు మారుస్తున్నారు. దీంతో డిపోల్లోని వర్క్ షాపుల్లో ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. జిల్లాలోని ఐదు డిపోలకు కనీసం వంద కొత్త బస్సులను సరఫరా చేస్తారని చెబుతున్నారు. మహిళలకు కేటాయించే సీట్లకు కూడా కొత్తగా రంగులు వేస్తున్నారు. బస్ స్టేషన్లలో మరుగుదొడ్ల మరమ్మతులతో పాటు అదనంగా కుర్చీలు, ఫ్యాన్లు, తాగు నీరు ఏర్పాటు చేస్తున్నారు. ఇక ప్రయాణికుల తాకిడి (పీక్ అవర్స్) సమయాల్లో అంటే ఉదయం 8-11, సాయంకాలం 4-7 గంటల మధ్య సర్వీసులు, వసతుల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మొత్తానికి అన్ని రకాల ఏర్పాట్లు 10వ తేదీకల్లా పూర్తి కావాలని డిపో అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

జీరో టికెట్ విధానం

మహిళా ప్రయాణికులకు జీరో టికెట్లు జారీ చేయనున్నారు. ప్రభుత్వం నుంచి ఉచిత పథకం నిధులు ఆర్టీసీ రాబట్టుకోవలసి ఉన్నందున జవాబుదారీ కోసం ప్రతి ప్రయాణికురాలికి టికెట్లు ఇవ్వడం తప్పనిసరి చేస్తున్నారు. దీనికి సంబంధించి జారీ చేసే టికెట్టు నమూనా విస్తృత ప్రచారంలో ఉంది. విజయవాడ నుంచి తిరువూరుకు రూ.120 టికెట్టు ధర ఉంది. రాయితీ రూ.120గా పేర్కొన్నారు. చెల్లించాల్సింది సున్నాగా చూపించారు. పై భాగాన పెద్ద అక్షరాలతో స్త్రీశక్తి అని ముద్రించారు. బస్సు నంబరు, డ్రైవరు నంబరు, ప్రయాణ దూరం, సీటు నంబరు ఇవన్నీ ముందున్నట్టే ఉన్నాయి.



స్త్రీశక్తి పేరుతో జనరేట్ చేసిన మోడల్ టికెట్టు

ఈ నమూనా టికెట్టు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. మహిళలు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుంది. కేవలం ఏపీకి చెందిన వారుగా ధ్రువీకరించుకోవడానికి మాత్రమే ఈ గుర్తింపు కార్డు అవసరమవుతుంది. మొత్తానికి ఆగస్టు నెలంతా అన్నదాత సుఖీభవ, కొత్త స్మార్ట్‌రేషన్ కార్డుల జారీ లాంటి భారీ సంక్షేమ పథకాల హడావిడిలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం కూడా సందడి చేయనుంది.

జిల్లాలో ఆర్టీసీ సమాచారం

జిల్లాలో మొత్తం ఐదు ఆర్టీసీ డిపోలున్నాయి. పీలేరు, మదనపల్లె, బి.కొత్తకోట, రాయచోటి, రాజంపేట నుంచి సర్వీసులు నడుస్తున్నాయి. ప్రస్తుతానికి ఈ డిపోల ద్వారా 545 బస్సులు అందుబాటులో ఉన్నాయి. రోజూ ఇవి లక్ష కిలోమీటర్లకు పైబడి తిరుగుతున్నాయని సమాచారం. ఈ సర్వీసుల ద్వారా రోజూ సరాసరిన లక్షా 40 వేల మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో మహిళా ప్రయాణికులే 50 వేల వరకు ఉన్నట్లు అధికారుల అంచనా. పట్టణ ప్రాంతాల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గ్రామీణ ప్రాంతాల కన్నా అధికంగా ఉంది. మొత్తం మీద 35 శాతం మహిళల ప్రయాణ వాటాగా ఉంది. ఉచిత బస్సు ప్రయాణంతో ఇది 50 శాతానికి మించి ఉంటుందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. అందుకు అనుగుణంగా 15 నుంచి 20 శాతం బస్సులు, 40 శాతం సర్వీసులు పెంచేందుకు సమాయత్తమవుతున్నారు. రద్దీ ఉన్న చోట కొన్ని సర్వీసులు పూర్తిగా మహిళలకు కేటాయించనున్నారు.

తాత్కాలిక డ్రైవర్ల నియామకాలు

అదనపు సర్వీసులకు అవసరమైన సిబ్బందిని కూడా ఆర్టీసీ సిద్ధం చేస్తోంది. కాల్ ఆన్ విధానంలో డ్రైవర్ల నియామకాల కోసం ఇప్పటికే అన్ని డిపోలు ప్రకటనలు జారీ చేశాయి. 21-40 ఏళ్ల మధ్య వయసు ఉండి, హెవీ వాహనాల లైసెన్సు కలిగి డ్రైవింగ్‌లో కనీసం 18 నెలల అనుభవం కలిగినవారు ఆర్టీఏ క్లియరెన్సు, ఇతర సర్టిఫికెట్లతో నేరుగా డిపో మేనేజరు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరుతున్నారు. కాగా మహిళలకు ప్రత్యేకంగా నడిపే సర్వీసులకు కండక్టర్ల అవసరం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రిన్సిపాల్ వేధింపులతో.. ఉపాధ్యాయురాలికి తీవ్ర అనారోగ్యం

- బాధితురాలి భర్త ఆవేదన


రాయచోటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయురాలు

వీరబల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వీరబల్లి కేజీబీవీ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు రామకృష్ణమ్మ బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆమెకు ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో సిబ్బంది వీరబల్లిలోని వైద్యుల వద్ద చూపించి చికిత్స నిమిత్తం రాయచోటికి తరలించారు. ఈ సందర్భంగా రామకృష్ణమ్మ భర్త ఆంజనేయులు మాట్లాడుతూ.. వీరబల్లి కేజీబీవీ ప్రిన్సిపాల్ సాయిదివ్య వేధింపులతో తన భార్య అనారోగ్యానికి గురయ్యారన్నారు. ప్రిన్సిపాల్ కొంతకాలంగా రామకృష్ణమ్మకు సీఎల్‌లు ఇవ్వడం లేదని, పాఠశాలకు సంబంధం లేని పర్సనల్ విషయాలతో తిడుతోందన్నారు. దీనిపై ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయన్నారు ప్రిన్సిపల్ ఇష్టారాజ్యంగా మాట్లాడడంతో రామకృష్ణమ్మ మనస్థాపానికి గురై కింద పడిపోయి అస్వస్థతకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జిల్లా అధికారుల సపోర్టు ఉందని సస్పెండ్ చేయిస్తానని ప్రిన్సిపాల్ బెదిరించేదని వాపోయారు. పిల్లల్ని టీసీలు ఇచ్చి పంపుతానని బెదిరిస్తోందని అన్నారు. ఈమె వల్ల పలువురు ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఇబ్బందులకు గురై బదిలీపై వెళ్లగా, ఒకరిని ఏకంగా ఉద్యోగం నుంచి తప్పించిందని పేర్కొన్నారు. ఈమెపై కలెక్టర్ చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా.. వీరబల్లి కేజీబీవీలో ప్రిన్సిపాల్‌కు, ఉపాధ్యాయురాలికి మధ్య జరిగిన సంఘటన గురించి విచారించామని ఎంఈవోలు వీర నాగయ్య, క్రిష్ణయ్య అన్నారు. ప్రస్తుతం రామకృష్ణమ్మ ఆరోగ్యం బాగుందని తెలిపారు. ఈ సంఘటనపై జిల్లా అధికారులకు తెలిపి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

నాలుగు లారీలు సీజ్


మైన్స్ అధికారులు సీజ్ చేసిన లారీలు

రామసముద్రం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులోని క్వారీలో తరలిస్తున్న నాలుగు లారీలను సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించినట్లు మదనపల్లె మైన్స్ అధికారులు తెలిపారు. గత కొంతకాలంగా గొల్లపల్లె సమీపంలోని గుట్టలో చేతివృత్తుల వారు రాళ్లు కొట్టుకుని జీవనోపాధి పొందుతున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని కొంత మంది అనుమతులు లేకుండానే పెద్ద ఎత్తున రాళ్లను పగులగొట్టి ఇటుకల పరిమాణంలో రాళ్లను కర్ణాటక, తమిళనాడుకు తరలిస్తున్నట్లు మైన్స్ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి రాళ్లను లారీలలో నింపి తరలిస్తుండగా దాడులు చేసి లారీలను సీజ్ చేసినట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తగు చర్యలు తీసుకుంటామని మైన్స్ అధికారులు తెలిపారు.

కిలో టమోటా ధర రూ.52

గుర్రంకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు రోజు రోజుకు పెరుగుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టమోటా ధరలు పది రోజులుగా పెరుగుతూ వచ్చాయి. బయట రాష్ట్రాల్లో టమోటా పంటలు దెబ్బతినడం, ఉన్న టమోటా తోటలు వర్షాలకు పూర్తిగా దెబ్బతిని కాయలు నాసిరకంగా మారాయి. దీంతో టమోటా పంటకు ధరలు వచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ క్రమంలో గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో కిలో టమోటా ధర రూ.52 పలికింది. ఈ లెక్కన 25 కిలోల టమోటా క్రేట్ ధర రూ.1300 గరిష్టానికి చేరుకొంది. టమోటా ధరలు పెరగడంతో రైతులు పంట సాగుపై బిజీబిజీగా ఉన్నారు. కాగా ధరలు పెరగడంతో వినియోగదారులు ఒకింత అసహనానికి గురవుతున్నారు.


గుర్రంకొండ మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

చేపల చెరువు వేలం సాగేనా ?

- గుట్టుచప్పుడు కాకుండా ఎలాగని మండిపాటు
- నేడు వేలం అంటూ దండోరా

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం పెద్ద చెరువు చేపల వేలం గుట్టు చప్పుడు కాకుండా నిర్వహణకు పంచాయతీ అధికారులు సన్నాహాలు చేశారు. మార్చి 19న చేపల చెరువు వేలం నిర్వహించగా ఆధిపత్య పోరుతో వేలాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామాల్లో ఎవరికీ తెలియకుండా దండోరా వేయకుండా వేలం ఎలా నిర్వహిస్తారని గ్రామస్తులు నిలదీశారు. దీంతో అప్పట్లో పంచాయతీ అధికారులు వేలాన్ని వాయిదా వేశారు. గ్రామస్తులతో చర్చించి వారం రోజుల ముందు గ్రామాల్లో దండోరా వేయించి వేలం నిర్వహిస్తామనడంతో నాడు గ్రామస్తులు వెనుదిరిగారు. ఇప్పుడు కొత్తగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి అధికారులు అందుకు విరుద్ధంగా రాజకీయ నేతల అండదండలతో గుట్టు చప్పుడు కాకుండా పంచాయతీ తీర్మానం చేసుకుని మంగళవారం రాత్రి గ్రామాల్లో నామమాత్రంగా దండోరా వేయించి చేతులు దులిపేసుకున్నారు. పంచాయతీ నిబంధనల మేరకు వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి ఎటు వంటి బకాయిలు ఉండరాదని, ధరావత్తుగా రూ.87,500 చెల్లించాలని నిర్ణయించారు. ఇంత పెద్ద మొత్తంలో ధరావత్తు చెల్లించాలంటే తగిన సమయం ఇవ్వకుండా వేలం నిర్వహించడం పంచాయతీ ఆదాయానికి గండి కొట్టినట్లేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మార్చి 19న వేలం నిర్వహించిన సమయంలో వారికి అనుకూలంగా ఉన్న కొందరు ధరావత్తు సొమ్మును చెల్లించారు. అయితే ఆ ధరావత్తు సొమ్మును వెనక్కు తీసుకోకుండా పంచాయతీ అధికారుల వద్దే ఉంచుకుని కొత్తగా ధరావత్తు సొమ్మును కట్టించుకో కుండా గతంలో కట్టిన వారికే కట్టబె ట్టాలనే ఎత్తుగడలు వేసి గతంలో ఉన్న వారికే లబ్ధి చేకూర్చేందుకే ఇలా గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాట్లు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట


ప్రేమ జంటతో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన చలమాల నవీన్ కుమార్, పులివెందుల మండలం భాకరాపురం గ్రామానికి చెందిన సయ్యద్ మనీషా వివాహం చేసుకుని బుధవారం సాయంత్రం నందలూరు పోలీసులను ఆశ్రయించారు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి కథనం మేరకు వీరిద్దరూ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారని, బుధవారం రాజంపేట సమీపంలోని పోలిచెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి గుడిలో పెళ్లి చేసుకుని రక్షణ కోసం తమను ఆశ్రయించారని తెలిపారు. ఇద్దరూ మేజర్లు కావడంతో ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

కంచె ధ్వంసం- కేసు నమోదు


పొలంలో దౌర్జన్యంగా ధ్వంసం చేసిన కంచె

రాజంపేటటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తన పొలానికి వేసుకున్న కంచెను ముగ్గురు వ్యక్తులు ధ్వంసం చేశారంటూ మండల పరిధిలోని మిట్టపల్లికి చెందిన ఈశ్వరరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు ఈశ్వరరాజుకు అదే గ్రామానికి చెందిన వెంకటరాజు, లక్ష్మీకరరాజు, భానుప్రకాష్‌రాజు మధ్య భూవివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈశ్వర్‌రాజు సమస్య పరిష్కరించుకోకుండానే పొలం చుట్టూ కంచె వేయడంతో దానిని వారు ధ్వంసం చేశారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు మన్నూరు సీఐ కుళాయప్ప తెలిపారు.

బొప్పాయి దళారుల దాగుడుమూతలు....!

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- రైతుల ఆందోళన


రైతుల ఉద్దేశించి మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భావన

రైల్వేకోడూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ నిర్ణయించిన ధరలను దళారులు చెల్లించడం లేదంటూ బుధవారం బొప్పాయి రైతులు కోతలను నిలిపివేశారు. బొప్పాయి తోటల వద్దకు వచ్చిన లారీలను వెనక్కి పంపించారు. రైల్వేకోడూరులోని దళారీలందరూ సిండికేటుగా ఏర్పడి టన్ను బొప్పాయి కాయలకు రూ. 7,000 మాత్రమే చెల్లిస్తున్నారంటూ గత నెల 31న రైల్వేకోడూరులో బొప్పాయి రైతులు ఎత్తున ఆందోళన చేశారు. పలు రకాలుగా నిరసన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ చామకూరి శ్రీధర్, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి స్పందించి ఈ నెల 1న ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో రైతులు, దళారీలు, మార్వాడీలతో సమావేశం నిర్వహించారు. నాలుగు గంటల చర్చల అనంతరం టన్ను ధర రూ.9 వేలకు తక్కువ కాకుండా కోతలు కోసేందుకు అందరూ ఒప్పుకున్నారని కలెక్టర్ శ్రీధర్ ప్రకటించారు. 5వ తేదీ తర్వాత టన్ను రూ.10 వేలు చేస్తారని తెలిపారు. అయితే ఢిల్లీలో వర్షాలు తగ్గుముఖం పట్టినా, అక్కడ వర్షాలు కురుస్తున్నాయన్న సాకు చెప్పి దళారులు టన్ను ధర రూ.8 వేలు చేశారని రైతులు అధికారులకు విన్నవించారు. ఈ విషయం టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

సబ్ కలెక్టర్ ఆరా..

రైల్వేకోడూరులో బొప్పాయి ధర టన్ను రూ.8 వేలకు తగ్గించారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలియడంతో, ఆయా వర్గాలతో చర్చించి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ రాజంపేట సబ్ కలెక్టర్ భావనను ఆదేశించారు. దీంతో ఆమె బుధవారం సాయంత్రం రైల్వేకోడూరు రెవెన్యూశాఖ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సుబ్బరామరాజు, ఆదినారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో సుమారు 100 మంది బొప్పాయి దళారులు ఉన్నారని, వీరంతా సిండికేట్ అయి రైతులను నిలువునా మోసం చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలను దళారులు బేఖాతరు చేస్తున్నారని తెలిపారు. దళారీ రమేష్‌బాబు మాట్లాడుతూ రైతుల ఆందోళన తర్వాత మార్వాడీలు, దళారులు, రైతులకు మధ్య గ్యాప్ వచ్చిందన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇక్కడ జరిగిన విషయాలను కలెక్టర్‌కు వివరిస్తామన్నారు. టన్ను బొప్పాయి కాయలను రూ. 9కు తగ్గకుండా చెల్లించాలని దళారులను ఆదేశించారు. రేపటి నుంచి టన్ను రూ.10 వేలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, ఉద్యానశాఖాధికారి భాస్కర్, మార్కెటింగ్ కార్యదర్శి లక్ష్మీకాంత్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మానస, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గల్లా రమణ, సీఐ కె.హేమసుందర రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరుణాకర్‌రెడ్డికి ఘన సన్మానం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీలో 2024-2025 ఏడాదికి సంబంధించిన రైతులకు ఉత్తమ సేవలు అందించిన మదనపల్లె సింగిల్ విండో సీఈఓ కరుణాకర్ రెడ్డికి తగిన ప్రతిఫలం అభించిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఉత్తమ అవార్డు గ్రహితగా ఎంపిక చేశారని అన్నారు. బుధవారం మదనపల్లె సింగిల్ విండో కార్యాలయంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి మధుబాబు, మదనపల్లె 1,2 డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి, సోముశేఖర్, మురళి, మధు, నాగేంద్ర, ప్రవీణ్, రాయల్, మహేష్, జగదీష్ పుష్పగుచ్ఛాలను అందించి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.


కరుణాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

యువకుడిపై కుక్క దాడి


గాయపడ్డ ప్రవీణ్

సిద్దవటం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కుక్క దాడి చేయడంతో ఓ యువకుడు గాయపడ్డాడు. మండలంలోని టక్కోలి ఎస్సీ కాలనీకి చెందిన ప్రవీణ్ అనే యువకుడిపై బుధవారం కుక్క దాడి చేయడంతో చేతులు, మెడ భాగాల్లో గాయాలయ్యాయి. దీంతో అతను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స చేయించుకున్నాడు. ఈ కుక్క ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారిపై దాడి చేస్తోందని, దీనిని పట్టుకుని ఊరికి దూరంగా తరలించాలని బాధితుడితో పాటు పలువురు అధికారులను కోరుతున్నారు.

సాంప్రదాయ సంస్కృతికి ప్రతీక చేనేత


చేనత మగ్గం

- సాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర
- నేడు నేతన్నల పరిస్థితి దయనీయం
- ప్రభుత్వాల సాయం అంతంతే..
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మనదేశ సంస్కృతీ సాంప్రదాయాలకు విశిష్టమైన ప్రతీక చేనేత రంగం. 1905 ఆగస్టు 7న బెంగాల్‌లో మొదటిసారిగా విదేశీ వస్త్ర బహిష్కరణ ప్రారంభించబడింది. అంతేకా కుండా స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత కార్మికులు చురు గ్గా పాల్గొని స్వతంత్ర్య స్ఫూర్తి ని రగిలించారు. ఈ క్రమం లో భారతప్రధాని నరేంద్రమోడీ 2015 ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవా న్ని మనం జరుపుకుంటున్నాం. వ్యవసాయరంగం తరు వాత అత్యధిక శాతం ప్రజలు చేనేతరంగంపై ఆధార పడి జీవించేవారు. అయితే కాలక్రమంలో నేత వస్త్రాలకు డిమాండ్ తగ్గడం, తయారీకి ఖర్చు పెరగడంతో ఆ రంగం నష్టాల ఊబిలో కూరుకుపోతోంది. గతంలో చేనేత కార్మికులకు చేతినిండా పని ఉండేది. అయితే ముడిస రుకు ధర పెరిగిపోవడం, కొనుగోలుదారులు తగ్గిపోవ డంతో పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో పట్టుచీరలకు నేత కార్మికులకు ఒక్కో చీర నేసేందుకు రూ.4వేలు వరకు కూలీ లభించేది. అయితే మరమగ్గాలు వచ్చినప్పటి నుంచి చేనేత వస్త్రాలకు డిమాండ్ తగ్గడం వల్ల వీరికి పనిలేకుండాపోతుంది. ఇప్పుడు ఒక్క చీర నేస్తే రూ.2వేలు ఇస్తున్నారు. నెలకు నాలుగు చీరల వరకు నేస్తారు, ఈ లెక్కన రూ.8వేలు మాత్రమే చేనేత కూలీలకు దక్కుతుంది. దీని వల్ల కుటుంబ పోషణ భారంగా మారడంతో ప్రభుత్వసాయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి.

జిల్లాలో 15100 మంది చేనేత కార్మికులున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీరిలో స్వయంగా మగ్గా లపై 7165 మంది పనిచేస్తుండగా సహకార సంఘాల ద్వారా 7935 మంది మగ్గం పనులు చేస్తున్నారు. జిల్లాలో చేనేత, సిల్క్ సహకార సంఘాలు 210 వరకు పనిచేస్తు న్నాయి. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మాధవరం, బద్వేలు, ఖాజీపేట, కమలాపురం ప్రాంతాల్లో ఎక్కువగా చేనేత మగ్గాలు, సహకర సంఘాలు ఉన్నాయి. జమ్మల మడుగులో ఎక్కువగా పట్టుచీరలు, కాటన్ చీరలు, దూపి యాన్ పట్టు, లివరీ వస్త్రాలు తయారు చేస్తారు. ప్రొద్దు టూరు నియోజకవర్గంలో దూపియాన్ సిల్క్,


చేనేత వస్త్రాలు

లివరీ సిల్క్ చీరలు, దోతీలు తయారు చేస్తారు. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో దూపియాన్ సిల్క్‌తో పాటు సిల్క్ చీరలు, లివరీ నేత పనులు చేస్తారు. బద్వేలు నియోజక వర్గంలో బద్వేలు సికో చీరలు, లివరీ నేస్తారు. పులివెం దుల నియోజకవర్గంలో పట్టుపావడాలు, పట్టుచీరలు, కమలాపురం నియోజకవర్గంలో పట్టుచీరలు, లివరీ, రాజంపేట నియోజకవర్గంలోని మాధవరంలో సిల్క్ కాట న్‌చీరలు, కడప నియోజకవర్గంలో పట్టుచీరలు నేస్తారు.

చేనేతరంగానికి ఊతం

అత్యధికంగా చేనేత కార్మికులు ఉన్న జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రాంతా ల్లోని చేనేత రంగాల్లోని కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు మార్కెటింగ్ సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏపీ ప్రభుత్వం 2005-06 సంవత్సరంలో మైలవరంలో టెక్స్‌టైల్ పార్కును మంజూరు చేసింది. రూ.7.38 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. వేపరాల, మైలవరం, దొమ్మరనంద్యాల, మోరగుడి, జమ్మలమడుగు, కన్నెలూరు ప్రొద్దుటూరు ప్రాంతాల్లోని చేనేత పవర్‌లూమ్ క్లస్టర్ల రద్దీని తగ్గించేం దుకు యూనిట్లను తరలించేందుకు సహయపడడానికి టెక్స్‌టైల్ పార్కు ప్రధాన భూమిక పోషించనుంది.



రుణాలు ఇచ్చి ఆదుకోవాలి



30 సంవత్సరాలుగా నేత పని చేస్తున్నాను. మగ్గం పని తప్ప ఇతర ఏ పని చేతకాక పోవడంతో చేనేతే ఆదరు వుగా నిలుస్తుంది. కానీ మరమగ్గాలు వచ్చిన తరు వాత చేనేత వస్త్రాలకు డిమాండ్ తగ్గింది. మరమగ్గా లపై రోజుకు 3 చీరలు నేస్తే చేనేత ద్వారా వారానికి ఒకచీర నేస్తాం. ఈ క్రమంలో ప్రభుత్వం చేనేతలను ఆదుకునేందుకు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలి.
-పొట్ట శివకుమార్, చేనేత కార్మికుడు, మాధవరం

చేనేత వస్త్రాలకు మంచిగిరాకీ



చేనేత వస్త్రాలకు మంచి గిరాకీ ఉంది. తరతరాలుగా మా కుటుంబం ఈ వ్యాపా రంపైనే ఆధారపడి ఉంది. సొంతంగా మగ్గాలు పెట్టి వస్త్రాలను నేయించడంతో పాటు ఇతర ప్రాంతాల్లో నేసిన వస్త్రాలను తీసుకు వచ్చి మా దుకాణం ద్వారా విక్రయాలు చేపడు తున్నాం. చాలా వరకు తక్కువ మార్జిన్ పెట్టుకుని విక్రయించడం వల్ల ఎక్కువ మంది కొనుగోలు దారులు వస్తున్నారు.
-ఈశ్వర్, చేనేత వస్త్రవ్యాపారి, మాధవరం

చేనేత కార్మికులకు ప్రయోజనాలు

జిల్లాలోని చేనేత కార్మికులకు 9116 మందికి 4వేల చొప్పు న ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పింఛను అందజేస్తారు. అదే విధంగా చేనేత కార్మికులకు ఆర్థిక సాయం అందించే క్రమంలో 2016 సెప్టెంబరు 1 నుంచి ముద్ర రుణాలు అందిస్తుంది. కాటన్ సిల్క్ రకాల దుస్తులను ఉత్పత్తి చేసే నేత కార్మికులకు బ్యాంకుల నుంచి ఐదులక్షల వరకు, మార్జిన్ మనీ సహాయంతో 20శాతం గరిష్టంగా 25వేల రూపాయలు నోడల్ బ్యాంకు అయిన పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా సహాయం అందజేస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 1133 ముద్ర రుణాలు లక్ష్యంగా నిర్దేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 933 మందికి ముద్ర రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేనేత రంగానికి సబ్సిడీలు పూర్తిస్థాయిలో నిలిపివేసింది. ఈ క్రమంలో చేనేత సహకార సంఘాలు సైతం నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక నేత కార్మికుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది.

నేతన్నకు కావాలి.. మరింత చేయూత

నేటి నుంచి ఉచిత విద్యుత్తు అమలు

మదనపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సంక్షోభం, ఒడిదొడుకుల మధ్య సాగుతున్న నేతన్నలకు కూటమి ప్రభుత్వం చేయూతతో ఊపిరిపీల్చుకుంటున్నారు. చేనేత రంగానికి ఉచిత విద్యుత్తు ప్రకటనతోపాటు జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురు వారం నుంచి హామీని ప్రభుత్వం నిలబెట్టు కుంటోం ది. ఇందులోభాగంగా చేనేత మగ్గాలకు విద్యుత్తు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తును అమలు చేస్తోంది. అలాగే జీఎస్టీ నుంచి చేనేత రంగాన్ని మినహాయించడం శుభపరిణా మంగా చెప్పాలి. జాతీయ చేనేత దినోత్సవం సంద ర్భంగా చేనేత రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కార్మికులు పడుతున్న కష్టాలు, ముడిసరుకు ధరలు, మార్కెటింగ్ సౌకర్యంపై ప్రత్యేక కథనం.

వ్యవసాయం, పాడిపరిశ్రమ తర్వాతి స్థానాన్ని చేనేత రంగంగా చెప్పవచ్చు. కాలక్రమేణా చేనేత రంగం కూడా కళతప్పుతోంది. మల్బరీసాగు ఏటికేడు తగ్గిపోవడం, మార్కెట్‌లో ముడిసరుకు ధరలు విపరీతంగా పెరిగిపోవడం, చేనేత స్థానంలో పవర్ లూమ్స్ రావడం కూడా కారణంగా చెబుతున్నారు. అలాగే ఈ రంగంలోకి కొత్తగా వచ్చే యువత, కార్మి కులు తగ్గిపోవడం, నైపుణ్యమైన కార్మికులు అందుబా టులో లేకపోవడం కూడా మరో కారణమని చెప్పాలి. మరోవైపు మార్కెట్‌లో పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని చేనేత రంగం అందుకోలేక పోవడమే కాదు.. పవర్‌లూమ్‌కు ధీటుగా డిజైన్లు అందిపుచ్చు కోలేకపోతోంది. చేనేత పరిశ్రమ పదికాలాలపాటు పదిలంగా ఉండాలంటే కార్మికులు, మాస్టర్‌వీవర్స్‌కూ ప్రత్యేకమైన శిక్షణతో పాటు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి వుందని ఆ రంగం నిపుణులు కోరుతున్నారు.

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. వీరిలో మదనపల్లె నీరుగట్టువారిపల్లెలో ఎక్కువగా ఉన్నారు. తర్వాత తంబళ్లపల్లె, బి.కొత్తకోట, ములకలచెరువు, గాలివీడు, వీరబల్లి, మట్లి, సంబేపల్లె, తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. జిల్లాలో మొత్తంగా తీసుకుంటే 20వేలకుపైగా చేనేతలు, 10వేలు పవర్‌లూమ్స్ ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నారు. ఇలా మొత్తమ్మీద తీసుకుంటే చేనేత రంగంపై ప్రత్యకంగా, పరోక్షంగా లక్షమందికిపైగా ఆధారపడి జీవిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జీఎస్టీ, ఉచిత విద్యుత్తుతో ఆయా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ఇన్‌స్పెక్టర్ మృతి


మోహన్ (ఫైల్)

జమ్మలమడుగు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ఇన్‌స్పెక్టర్ మోహన్ (52) మృతి చెందారు. ఈయన ఆలయంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇన్‌స్పెక్టర్ హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఆలయంలో ఉండగా.. 11 గంటల సమయంలో ఓఫోన్‌కాల్ రావడంతో మాట్లాడుతూ కుప్పకూలిపోయాడు. వెంటనే అక్కడున్న సిబ్బంది వారి కుటుంబీకులకు సమాచారం అందించి స్థానికంగా ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం నంద్యాల శాంతిరాం ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి జాతీయ రహదారి గోటూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. కడప నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న బస్సు ఎర్రగుంట్ల నుంచి కడపకు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీనడంతో ద్విచక్ర వాహనదారుడికి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వల్లూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. ద్విచక్రవాహనదారుడు ఖాజీపేట మండలం అప్పనపల్లెకు చెందిన చౌడయ్యగా గుర్తించారు. ఇతను ఎర్రగుంట్లలో బంధువుల ఇంటి నుంచి కడపలో తాను పని చేస్తున్న జ్యూవెలరీ షాపునకు వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొండాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గండికోట బ్యాక్ వాటర్‌లో బుధవారం గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... కొండాపురం రైల్వే బ్రిడ్జి సమీపంలో గండికోట బ్యాక్‌వాటర్‌లో 20-23 సంవత్సరాల వయసు గల యువకుని మృతదేహం స్థానికులు గుర్తించారు. ఈ యువకుడు నల్లఫ్యాంట్, గల్ల చొక్క ధరించి వున్నాడు. అతడు ఏ ప్రాంతం వాడని తెలియరాలేదు. స్థానికుల సహాయంతో పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. వీఆర్‌వో నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా వివరాలు తెలిస్తే 9121100611, 9121100612 ఫోన్ నెంబర్లకు తెలయజేయాలన్నారు.

మహిళ అదృశ్యం

బి.కోడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన కొండా దొరసానమ్మ (32) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ వెంకటసురేశ్ తెలిపారు. ఆమె మానసిక స్థితి సరిగాలేక ఈనెల 3వ తేదీ ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్లు ఆమె తం డ్రి కొండా వెంకటరామిరెడ్డి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిషన్ శక్తితో మహిళా సాధికారత : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మిషన్ శక్తి కార్యక్రమం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్‌శక్తిలో సంబల్ మరియు సామర్థ్య ఉప పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిదన్నారు సంబల్ పథకం మహిళల భద్రతకు, సమర్థ్య పథకం మహిళల సాధికారత కోసం ఏర్పాటు చేసిందన్నారు. వన్‌స్టాప్ సెంటర్ల ద్వారా చట్టపరమైన కౌన్సెలింగ్, మానసిక సామాజిక కౌన్సెలింగ్‌లు అందించాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు అవగాహన కల్పించాలన్నారు. సమర్థ్య పథకంలో భాగంగా బాధిత మహిళలకు పునరావాసం కల్పించే శక్తి సదన్‌లు కడపలో 3, మైదుకూరులో 1 పని చేస్తున్నాయన్నారు. జిల్లాలో శక్తి సదన్లను బలోపేతం చేసి మహిళలు ఆర్థికంగా అబివృద్ధి చెందడానికి నైపుణ్య శిక్షణలు, ఉపాధి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద మొదటిసారి ప్రసవానికి రూ5 వేలు, రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.6వేలు అందిస్తోందన్నారు. మహిళల పరిరక్షణకు 181 ఉమెన్ హెల్ప్‌లైన్ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, రైల్వే, హాస్పిటల్స్‌లో మదర్ ఫీడింగ్ రూములను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, పిల్లల సమస్యల కోసం పాఠశాలల్లో సి బాక్సులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మహిళ శిశు సంక్షేమం సాధికారత అధికారి రమాదేవి, సోషల్‌వెల్ఫేర్ డీడీ సరస్వతి, డీఈవో షంషుద్దీన్, స్టెప్ సీఈవో సాయి గ్రేస్, సీపీవో హజరత్తయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు చేసిన చోట బోర్డులు ఏర్పాటు చేయాలి


ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

చెన్నూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉపాధి పనులు ఎక్కడ చేపట్టినా పనిచేసిన చోట ఆ పని విలువ, ఏ పని చేశాం, ఎంత దూరం చేశామనే సూచించే బోర్డులు తప్పక ఏర్పాటు చేయాలని జాతీయస్థాయి పర్యవేక్షణ బృందం కేంద్ర కమిటీ సభ్యులు చూడామణిరెడ్డి, దివాకర్‌రెడ్డిలు అన్నారు. బుధవారం చెన్నూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు, గోకులాలు కట్టుకున్న రైతులు ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డులు సరిగా ఉన్నాయా... వాటికి తగినట్లు పనులు కల్పిస్తున్నారా.. దినసరి కూలీ ఎంత పడుతోంది.. కూలీ ఎలా ఇస్తున్నారు.. వంటి వాటిపై అడిగి తెలుసుకున్నారు. అలాగే గోకులాల బిల్లులు వచ్చాయా.. ఒక్కో గోకులం షెడ్డులో ఎన్ని బర్రెలు, ఆవులు ఉన్నాయి అని ఆరా తీశారు. అలాగే పక్కాగృహాలు నిర్మించుకున్న వారికి సకాలంలో బిల్లులు అందించారా.. లేదా అని తెలుసుకున్నారు. అనంతరం చెన్నూరు, కొండపేట గ్రామాల్లో నిర్మించిన రోడ్ల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో గంగాదేవి, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, ఏపీడీలు రామలింగారెడ్డి, సుబ్బారెడ్డి, ఆనంద్, ., సర్పంచ్ వెంకటససుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ సహ ఆచార్యుడికి సత్కారం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అలెగ్జాండర్ వాన్ హంబో ల్ట్ (ఎవీహెచ్) పోస్టు డాక్టోరల్ ఫెలో డాక్టర్ పి.వాసు గోవర్ధనరెడ్డిని జర్మనీలోని హంబోల్ రెన్యూడ్ రీసెర్చ్ ఫెలోషిప్‌తో సత్కరించారు. అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ ఫౌండేషన్ ప్రదానం చేసిన ఈ ప్రతి ష్టాత్మక ఫెలోషిప్ ఈ ఏడాది మే 1 నుంచి జూలై 31 వరకు మూడు నెలల రెన్యూడ్ రీసోర్చ్ ఫెలోషిప్‌ను జర్మనీలో పూర్తి చేశారు. ఈయన ప్రొఫెసర్ రెనె విల్హెల్మ్ మార్గదర్శకత్వంలో అసమాన అర్గానో క్యాటలిసిస్లో తన పరిశోధన చేశారు. తన ఫెలోషిప్ సమయంలో, డాక్టర్‌రెడ్డి ఎన్-హెపిరో సైక్లిక్ కార్బెనెస్ (ఎవ సీలు)లు వాటి ఉత్ప్రేరక అనువర్తనాల పనితీరును గుర్తించారు. డాక్టర్ పి.వాసుగోవర్ధనరెడ్డి అనేక ప్రొఫెషన్లు, నెట్‌వర్కింగ్ ఈవెంట్లలో భాగస్వామ్యులయ్యారు. విజయ వంతంగా పరిశోధన పూర్తి చేసుకున్న డాక్టర్ వాసు గోవర్ధన్‌రెడ్డిని వైవీ యూ ఉపకులపతి శ్రీనివాసరావు, కులసచివులు పి.పద్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

మళ్లీ విరిగిన ధ్వజస్తంభం

- కనుపర్తి రామాలయం వద్ద ఘటన



చెన్నూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుపర్తి గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠలో అపశ్రుతి చోటు చేసుకుంది. బుధవారం రామాలయం ఎదుట ప్రతిష్ఠ కోసం ధ్వజస్తంభాన్ని క్రేన్ సాయంతో పైకి ఎత్తగానే విరిగి రెండు ముక్కలైంది. దీంతో దాత భాస్కర్‌రెడ్డి మనోవేదకు గురయ్యారు. ఈ ఏడాది జూన్ 6న ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించడానికి క్రేన్‌తో పైకి ఎత్తగానే విరిగి మూడు ముక్కలైంది. రెండు నెలల తరువాత మళ్లీ బుధవారం మరో ధ్వజస్తంభం తెప్పించి.. పూజా కార్యక్రమాలు చేసి ప్రతిష్ఠించేందుకు పైకి ఎత్త గానే మళ్లీ విరిగి రెండు ముక్కలైంది. దీంతో దాత భాస్కర్‌రెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు.

ఆర్టీసీ బస్సు కిందకు దూసుకెళ్లిన స్కూటర్

- సురక్షితంగా బయటపడిన కడపవాసి



తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో బుధవారం పెను ప్రమాదం తప్పింది. కడపకు చెందిన ధనుంజయరెడ్డి బుధవారం మధ్యాహ్నం తిరుమల నుంచి తిరుపతికి బయలుదేరారు. 29వ మలుపు వద్ద ముందువెళుతున్న ఆర్టీసీ బస్సును దాటే క్రమంలో బస్సును ఢీకొన్నారు. ఆయన కుడివైపు పడగా.. ఎడమవైపు పడిన ద్విచక్రవాహనం బస్సు కిందకు వెళ్లిపోయింది. భారీ శబ్దం రావడంతో బస్సు ఆగిపోయింది. అదృష్టవశాత్తు ధనుంజయరెడ్డి కుడివైపు పడటంతో ప్రమాదం తప్పింది. ద్విచక్రవాహనమే ఎడమవైపు ఓవర్‌టేక్ చేసే క్రమంలో తన బస్సును ఢీకొందని, తనది ఏ తప్పు లేదని బస్సు డ్రైవర్ నాగరాజు చెప్పారు. ఈ ఘటనతో కొద్ది సమయం ట్రాఫిక్ స్తంభించింది.

తల్లిదండ్రుల వద్దకు చేరిన బాలుడు


తల్లిదండ్రుల వద్దకు బాలుడు రిషిని చేర్చిన ఆర్టీసీ ఉద్యోగి

మైదుకూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలుడు రిషిని ఆర్టీసీ ఉద్యోగి అతని తల్లిదండ్రుల వద్దకు చేర్చిన సంఘటన బుధవారం మైదుకూరులో జరిగింది. ఆర్‌టీసీ డిపో క్లర్క్ లక్షుమయ్య, పోలీసుల వివరాల మేరకు... అనంతపురం జిల్లా గుత్తికి చెందిన కావడి సతీష్, రూతుకు ముగ్గరు సంతానం. వారిలో కుమారుడు రిషి(12) అనే బాలుడిని రెండు రోజుల క్రితం తల్లిదండ్రులు గట్టిగా మందలించడతో ఇంటి నుంచి పారిపోయి మైదుకూరు బస్టాండ్‌కు చేరుకున్నాడు. మంగళ వారం ఉదయం 7 గంటల సమయంలో రిషికి ఆకలి వేయడంతో తిరుపతికి వెళ్లే బస్సులో డబ్బులు అడుక్కుంటున్నాడు. అదే సమయంలో ఖాజా అనే వ్యక్తి బస్సు ఎక్కాడు. అయితే అతను తన సెల్‌ఫోన్ కనిపించడం లేదని, అది రిషినే తీశాడని పక్కనే ఉన్న పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. అయితే బాలుడు దొంగతనం చేసినట్లు కనిపించడం లేదని భావించిన ఆర్‌టీసీ డిపో క్లర్క్ లక్షుమయ్య వారి వెంట వెళ్లాడు. అక్కడ నుంచి ఖాజా సెల్‌ఫోన్‌కు పోలీసుల చేత కాల్‌చేయించారు. అవతలి వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి మీ సెల్‌ఫోన్ తన వద్ద ఉందని, నాకు బస్సులో దొరికిందని తెలిపాడు. దీంతో లక్షుమయ్య సెల్‌ఫోన్ కడపలోని ఆర్‌టీసీ విచారణ కౌంటర్‌లో ఇవ్వాలని అతనికి సూచించారు. దీంతో బాలుడు దొంగతనం చేయలేదని తెలుసుకున్న ఖాజా క్షమాపణలు చెప్పి వెళ్లిపోయారు. ఆర్టీసీ క్లర్క్ లక్షుమయ్య పోలీసుల వద్ద అనుమతి తీసుకొని, ఆ బాలుడికి టిఫెన్ తినిపించి, అతని తల్లిదండ్రుల సమాచారం తెలుసుకున్నారు. అనంతరం వారికి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పి బాలుడిని పోలీసుల సాయంతో వారి వద్దకు పంపాడు. బాలుడిని వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చిన ఆర్టీసీ ఉద్యోగి లక్షుమయ్యను పలువురు ప్రశంసించారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

ఇంట్లో ఊయలకు వేలాడుతూ కనిపించిన మృతదేహం



మృతి చెందిన షేక్ ఇమాంబి, చిన్నారి మెడ చుట్టూ కందిపోయిన దృశ్యం

ఎర్రగుంట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రాణీవనం పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న షేక్ ఇమాంబి(9) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బాలిక తండ్రి షేక్ ఆలీ వివరాల మేరకు.... ఎర్రగుంట్ల మున్సిపాలిటీ వినాయకనగర్‌లోని చేపల బజార్‌లో నివాసం ఉంటున్నాం. ఇమాంబి రాణీవనంలోని పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. బుధవారం తెల్లవారుజామున తాను గనిపనికి వెళ్లానని.. తన భార్య మహబూబ్‌బీ ఉదయం 7.30 గంటలకు బేల్దారి పనికి వెళ్లిందన్నారు. అయితే పాప స్కూల్‌కు వెళ్లింది లేనిది తనకు తెలియదన్నారు. మధ్యాహ్నం 3గంటలకు ఇంటి కొచ్చి చూడగా... ఇంటిలో కొక్కికి ఉన్న ఊయలకు వేలాడుతూ పాప కుర్చీలో పడిపోయి ఉంది. పలకరించినప్పటికీ పలకకపోవడంతో వెంటనే బయట ఉన్న మంచంపై పడుకోబెట్టాను. పక్కంటి వారి సహాయంతో ఆర్ఎంపీ వద్దకు తన కుమార్తెను తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు తెలి పారు. ఈ విషయం తెలిసిన సీఐ నరేష్‌బాబు, పోలీసు బృందం వినాయకనగర్‌లోని ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. బాలిక ప్రమాదవశాత్తు మృతి చెందిందా లేక ఏవైనా కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, ఇమాంబీ బుధవారం పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయ వర్గాలు తెలిపాయి. దీంతో చిన్నారి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి మైక్ సెట్ విరాళం



ఆలయానికి మైక్‌సెట్ అందజేస్తున్న మండిపల్లి హరిత

చిన్నమండెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లె కొండ మూల రోడ్డు వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరిత బుధవారం మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి

సిద్దవటం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సిద్దవటం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి చిరంజీవిరెడ్డి బుధవారం ప్రజలను హెచ్చరించారు. అట్లూరు, సిద్దవటం మండలాలకు చెందిన పలువురు వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు రాత్రి వేళల్లో దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులు, విరేచనాలు ఉన్నవారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలన్నారు.

'మున్సిపల్' హెచ్‌ఎంలకు ఎంఈవో పోస్టులు ఇవ్వాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ పోస్టులు కేటాయించాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం ఎంఈఓకు వినతిపత్రం అందించిన యూటీఎఫ్ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం కేవలం గవర్నమెంట్, జిల్లా పరిషత్ హెచ్‌ఎంలకు మాత్రమే ఎంఈఓ పోస్టులు కేటాయిస్తోందన్నారు. అయితే మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్నవారిపై శీతకన్ను వేసిందన్నారు. కోర్టు కేసులతో నిలిచిపోయిన మున్సిపల్ భాషా పండితులకు కూడా అడ్‌హాక్ పద్ధతిన ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, రవీంద్ర, శ్రీనప్పబాబు, కుమార్, రాము, జులాన్ బాష, గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో జహరాబీ



కుమ్మరపల్లిలో తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది



సిద్దవటంలో తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న డాక్టర్ రంగలక్ష్మి, ఐసీడీఎస్ సిబ్బంది

'తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం'

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవని లక్కిరెడ్డిపల్లె సీడీపీవో జహరాబీ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం కోనంపేట సెక్టార్-2లో అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు చాలా ఆరోగ్యకరమన్నారు. చాలా మంది తల్లులు పిల్లలకు డబ్బా పాలు పడుతూ ఉంటారని అవి పిల్లల ఎదుగుదలకు మంచిది కాదన్నారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు మస్తానమ్మ, కార్యకర్తలు నాగమణి, అనిత, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు: మండలంలోని కుమ్మరపల్లిలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిపి ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాలివీడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శారదమ్మ, సోనీ పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : పుట్టిన బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా అని ఆరు నెలల పాటు తల్లిపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్నం, జ్యోతి, ఆదిలక్ష్మి తెలిపారు. రేగడిగుంటవారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తల్లిపాలతో పాటు బిడ్డకు ఆరు నెలల నుంచి రెండేళ్ల పాటు పౌష్టికాహారం అందించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.

సిద్దవటంలో..

సిద్దవటం: బిడ్డపుట్టిన గంటలోనే శిశువుకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలని పి.కొత్తపల్లె వైద్యాధికారిణి రంగలక్ష్మి తెలిపారు. మండలంలోని మాచుపల్లె అంగన్వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లికి గర్భాశయ, రొమ్ము కేన్సర్‌లు వచ్చే అవకాశాలు తగ్గుతాయన్నారు.

రామాపురంలో..

రామాపురం : అప్పుడే పుట్టిన శిశువుకు గంటలోపు ముర్రుపాలు పట్టిస్తే బిడ్డ, తల్లి ఆరోగ్యకరంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ ప్రమీణ తెలిపారు. మండలంలోని సెక్టార్ కుమ్మరపల్లి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్త ఉమాదేవి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కోనేటి హరికి జనసేనతో సంబంధం లేదు

● రాజంపేట జనసేనపార్టీ సమన్వయకర్త దినేశ్

ఒంటిమిట్ట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కోనేటి హరిరాయల్ అనే వ్యక్తికి జనసేనపార్టీతో ఎలాంటి సంబంధం లేదని రాజంపేట జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల బరిలో జనసేనపార్టీ లేదన్నారు. తాము జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శినని, రాజంపేట జనసేనపార్టీ ఇన్‌చార్జినని చెప్పుకుంటూ కోనేటి హరిరాయల్ అనే వ్యక్తి నామినేషన్ వేశాడన్నారు. పొత్తు ధర్మాన్ని అతిక్రమించినందుకు ఆ వ్యక్తిపై అధిష్టానం తుది నిర్ణయం తీసుకునే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచాలని తెలియజేస్తున్నామన్నారు. అతను జనసేన పార్టీకి సంబంధించిన జెండాలు కాని, గుర్తు కాని, పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఫొటోలు కానీ ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎన్‌ఎస్‌ఎస్‌పీవో రఘురామయ్య

వీరబల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అజంతుల్లా, ఎన్‌ఎస్‌ఎస్ పీవో రఘురామయ్య సూచించారు. స్థానిక జూనియర్ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల నిర్మూలన, యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువత జీవితాన్ని పాడు చేస్తాయన్నారు. విద్యార్థులు వీటిపై అవగాహన పెంపొందించుకుని కుటుంబంలో, సమాజంలో కూడా అవగాహన తీసుకురావాలన్నారు. కళాశాలలో ర్యాగింగ్ నిషేధమన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యకు అభ్యసించాలన్నారు. ప్రతి విద్యార్థి సోదర భావంతో మెలగాలని, సైబర్ క్రైం వంటి వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మరో ప్రోగ్రామ్ అధికారి భాస్కర్, అధ్యాపకులు శ్యాంసుందర్‌రెడ్డి, చంద్రశేఖర్, అరుణమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం. పరిశుభ్రతపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న ఉమాశంకర్ కళాజాతా బృందం

పెనగలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనం.. పరిశుభ్రత సీజనల్ వ్యాధులు, రక్షిత మంచి నీరు తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బుధవారం సాయంత్రం రాజమండ్రికి చెందిన విభూతి ఉమాశంకర్ కళాబృందం పెనగలూరు బస్టాండు మూడు రోడ్ల కూడలిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలను పెంచాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. కొబ్బరిబోండాలు, ఖాళీ టైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు సురేష్, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

బీమాతో కుటుంబానికి ధీమా

● ఏపీజీబీ ఆర్ఎం సుశాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీబీ ఆర్ఎం సుశాంత్‌కుమార్

సంబేపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీమాతో ప్రతి కుటుంబం ధీమాగా ఉండవచ్చునని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ తెలిపారు. బుధవారం వెట్టిపల్లె కస్పాలో బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 50 ఏళ్ల లోపు వారు సంవత్సరానికి 436 రూపాయలు ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి జీవన యోజన బీమా పొందవచ్చునన్నారు. 18 నుంచి 70 ఏళ్ల లోపు వయసు వారు ఏడాదికి రూ.20 చెల్లించి ప్రధాన మంత్రి సురక్ష బీమా పొంద వచ్చునన్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యమని తెలిపారు. శెట్టిపల్లి శాఖ మేనేజర్ అరుణకుమారి, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న కుప్పాల

సిద్దవటం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ అకురోపల్లె హరిజనవాడకు చెందిన గంపాల శోభకు రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య రూ. 1,00,568ల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గంపాల కొండయ్య అనారోగ్యానికి చికిత్స పొందుతూ మరణించారన్నారు. ఆయన వైద్యం కోసం అయిన ఖర్చులు, బిల్లుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందించినట్లు తెలిపారు.

అమ్మ పేరుతో మొక్క నాటండి: మాజీ సీఎం కిరణ్



మొక్క నాటుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ అమ్మపేరుతో మొక్క నాటాలని మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి పిలుపు నిచ్చారు. మదనపల్లె రూరల్ మండలం, పొన్నూటి పల్లె, రామిరెడ్డిగారిపల్లెలో ముత్యాలమ్మ గుడి వద్ద మండల అధ్యక్షుడు తరిగొండ వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపు లా మొక్కలు నాటారు. అంతకముందే బీజేపీ నేతలు, మహిళలు మాజీ సీఎంకు స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, కృష్ణమూర్తి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు బొజ్జప్ప, రాయలసీమ కిసాన్ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

9 నుంచి ముత్తు మారెమ్మ జాతర



ముత్తుమారెమ్మ అమ్మవారు

నందలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లెలో ఉన్న ముత్తు మారెమ్మ జాతర ఈ నెల 9 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో తొలిరోజు అమ్మవారు, పోతులరాజు ఊరేగింపు, నిర్వహిస్తారు.

రెండో రోజు పోతులరాజు ఊరేగింపుగా వెళ్లి గ్రామ పొలిమేరలలో కావలి కాస్తున్న అన్నపూర్ణమ్మను తీసుకువచ్చి ఆలయప్రాంగణంలో వేపమండలతో నిర్మించిన మందిరంలో ఉంచుతారు. ఈ సందర్భంగా అమ్మవారికి అంబలి పోసి, కానుకలు, బలులు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

మూడో రోజు అమ్మవారిని పాలతో అభిషేకించి పొంగలిని భక్తులకు ప్రసాదంగా పంచి పెడతారు. హిందూ, ముస్లింలు పాల్గొనడం ఈ జాతర విశిష్టత అని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఇన్‌సర్వీసు డాక్టర్లకు పీజీ సీట్ల కేటాయింపుపై పునరాలోచించాలి

ఓబులవారిపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఇన్ సర్వీస్ ఉన్న డాక్టర్లకు పోస్టు గ్రాడ్యుయేట్ సీట్ల కోటాను 20 నుంచి 15 శాతానికి తగ్గించే నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ల డాక్టర్ల అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందని ఓబులవారిపల్లె వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రీ, గైనకాలజీ, రేడియాలజీ వంటి క్లినికల్ శాఖలకు మాత్రమే రిజర్వేషన్ పరిమితం చేశారని అన్నారు.. గత యేడాది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన స్పష్టమైన హామీ మేరకు ఇన్ సర్వీస్ అభ్యర్థులకు పీజీ కోటాపై ఏపీపీహెచ్‌సీడీఏ ప్రతినిధులతో సంప్రదింపుల తర్వాతే ఏ నిర్ణయమైనా తీసుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఎలాంటి అధికారిక సమాచారం లేకుండా, ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయం మారుమూల, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులను తీవ్రంగా నిరుత్సాహపరిచేలా ఉందన్నారు. దీంతో తమకు ఉన్నత విద్యావకాశాలు తగ్గిపోతున్నాయని నిరాశ వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్‌లో పల్లెటూర్లలో పనిచేయడానికి ఆసక్తి చూపే వైద్యుల సంఖ్యను కూడా ప్రభావితం చేస్తుందని, ఈ నిర్ణయాన్ని పునరాలోచించాల్సిందిగా కోరుతున్నామన్నారు.

సీఐల బదిలీ

రాజంపేట టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) :రాజంపేట పట్టణ సీఐ రాజా కొండాపురం సర్కిల్‌కు బదిలీ కాగా, కడప వీఆర్‌లో ఉన్న డి.నాగార్జున రాజంపేట సీఐగా నియమితులయ్యారు. రాజంపేట పట్టణ సీఐగా పి.రాజా ఈ ఏడాది ఫిబ్రవరి 17న బాధ్యతలు స్వీకరించారు. మూడు నెలల క్రితం బాధ్యతలు చేపట్టిన మన్నూరు సీఐ కుళాయప్ప రాయచోటి ట్రాఫిక్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వాయల్పాడు సీఐగా పనిచేస్తున్న జె.ప్రసాద్‌బాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

టీడీపీ గెలుపుతో ఒంటిమిట్ట అభివృద్ధి : చమర్తి



రాచపల్లెలో ప్రచారం చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు తదితరులు

ఒంటిమిట్ట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచ పల్లెలో బుధవారం జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డిని గెలిపించాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ గెలుపుతో ఒంటమిట్ట అభివృద్ధికి ముందడుగు పడుతుందని, మండల రూపురేఖలే మారిపోతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు, రాజంపేట టీడీపీ నాయకుడు ఎద్దల సుబ్బరాయుడు, మండల టీడీపీ సీనియర్ నాయకులు కొమరా వెంకట నరసయ్య, ఎస్వీ రమణ, మండల నాయకులు బొడ్డే వెంకటరమణ, నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సుంకేసుల బాషా, లక్ష్మీ నారాయణ నాయుడు, చింతగింజల సుబ్రమణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య, రేవిళ్ల బాల మునెయ్య తుమ్మలకుంట ఈశ్వరయ్య, రామాంజనేయరెడ్డి, బొడిచెర్ల శ్రీనివాసులు, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు. మండలంలోని నరసన్నగారిపల్లె, దర్జీపల్లె, గొల్లపల్లె, మలకాటిపల్లె గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి పూల భాస్కర్ విస్తృత ప్రచారం నిర్వహించారు.

చింతరాజుపల్లెలో సతీశ్ వేమన ప్రచారం



వేమన సతీశ్‌ను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

రాజంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా బుధవారం తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సతీశ్ వేమన చింతరాజుపల్లె గ్రామంలో స్థానిక నాయకులతో కలసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అంతకు ముందు ఒంటిమిట్ట ఏపీ టూరిజం గెస్ట్‌హౌస్ వద్ద ఆయనను టీడీపీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన రాజంపేట టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజుతో చర్చించారు. ఈ కార్యక్రమంలో బొడ్డే వెంకటరమణనాయుడు, లక్ష్మీనారాయణ నాయుడు, రసాల కదిరయ్య, గొల్ల నారాయణ, రసాల నరసింహనాయుడు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతు ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు

రామాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పంట సాగు చేసిన రైతు ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండ ల వ్యవసాయ అధికారి నాగ మణి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి, సరస్వతిపల్లెల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్రాప్‌లోని వివరాల ఆధారంగానే అన్నదాత సుఖీభవ మంజూరు అవుతుందన్నారు. రైతులందరూ తాము సాగు చేసిన పైర్ల వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, మనోహర్, సాయికృష్ణ పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు దీటుగా గురుకులాల్లో సౌకర్యాలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వెంకటరమణ

రామాపురం, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి): కార్పొరేట్ పాఠశాలల కు దీటుగా డాక్టర్ అంబేద్కర్ గురుకుల సంక్షేమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు లభిస్తున్నా యని అన్నమయ్య జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలోని గంగనేరు క్రాస్ వద్ద ఉన్న అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని తరగతి గదులను తనిఖీ చేసి విద్యార్థులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. రెండు తాగునీటి బోర్లలో నీరు అడుగంటిపోవడంతో ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు తెలియజేశారు. భోజనంపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

సంబేపల్లె, ఆగస్టు 6 (ఆంధ్ర జ్యోతి): సమాచార హక్కు చట్టం 2005పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి కిశోర్‌నాయక్ తెలిపారు. బుధవారం సంబేపల్లె రైతు భరోసాకేంద్రంలో సమాచార హక్కు చట్టం సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం ప్రకారం సంబంధిత రికార్డుల ఆధారంగా సమాచారాన్ని పొందవచ్చునన్నారు. సమాజంలో అవినీతి, అక్రమాలను సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చునని తెలియజేశారు. వ్యవసాయ విస్తరణాధికారి వెంకట్రమణ, గ్రామ వ్యవసాయశాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో చిన్నారులకు వైద్య సేవలు

సుండుపల్లె, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ దిలీప్‌గుప్తా బుధవారం తెలిపారు. మారుమూల సుండుపల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నెల రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. చాలా మంది చిన్న పిల్లలకు వైద్యం చేయించడం కోసం రాయచోటి, పీలేరు, తిరుపతి, కడప వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేకుండా మొట్టమొదటి సారి సుండుపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో తనను నియమించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని అన్ని గ్రామ పంచాయతీల ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవకాశం లేదని, సుండుపల్లె మండల కేంద్రంలోనే మెరుగైన వైద్యాన్ని అందిస్తానన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కోరం లేకపోవడంతో బుధవారం నిర్వహించాల్సిన లక్కిరెడ్డిపల్లె మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. సమావేశానికి హాజరుకాగా ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరుకాకపోవడంతో ఎంపీడీవో ఉషారాణి సమావేశం వాయిదా వేశారు. ఈ సమావేశానికి సర్పంచులు ఇద్దరు మాత్రమే హాజరైనట్లు ఆమె తెలిపారు.

ఉరి వేసుకుని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య


విద్యార్థి (ఫైల్‌ఫొటో)

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 6: బీటెక్ చదువుతున్న విద్యార్థి ఇంట్లోనే సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకుని మృతిచెందిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, చౌడేశ్వరి కూడలికి చెందిన సుధాకర్ కుమార్తె రెడ్డిశ్రావణి(21) పులివెందులలో బీటెక్ రెండో ఏడాది చదువుతోంది. సెలవులకు గత శనివారం మదనపల్లెకు వచ్చింది. బుధవారం తండ్రితో కలిసి గుడికి వెళ్లి ఇంటికి వచ్చిన తరువాత ఇంట్లోనే ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. తండ్రి చేనేత మగ్గం నేస్తుండగా తల్లి ఐదేళ్ల కిందట చనిపోయినట్లు తెలిపారు. కాగా సూసైడ్ నోట్‌లో 'నేను ఇక చదవలేనని' రాసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..


అబ్దుల్ రహీమాన్ మృతదేహం

కలకడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ బస్టాండు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అబ్దుల్ రహీమాన్(50) మృతి చెందినట్లు హెచ్‌సీ హరిబాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కలికిరి మండలం మేడికుర్తికి చెందిన అబ్దుల్‌రహీమాన్ భవన నిర్మాణ మేస్త్రీగా పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. కలకడలో ఓ పని కోసం కూలీలను సమకూర్చుకోవడానికి బాటవారిపల్లెకు నడుచుకొని వెళుతుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రహీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు హెచ్‌సీ తెలిపారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన కానిస్టేబుల్ రాఘువ, సోమశేఖర్

సిద్దవటం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లె గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాఘవ అనే కానిస్టేబుల్ మాధవరం నుంచి ద్విచక్ర వాహనంలో విధులకు వెళుతున్నాడు. అదేసమయంలో మిట్టపల్లెకు చెందిన సోమశేఖర్ ఎదురుగా రావడంతో రెండు బైకులు ఢీకొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్‌ను స్థానికులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. స్థానిక ప్రైవేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం సోమశేఖర్‌ను కూడా రిమ్స్‌కు తరలించారు ఎస్ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- ఇద్దరు స్మగ్లర్లు పరార్ ● కారు స్వాధీనం


పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలు, కారుతో ఫారెస్టు అధికారులు

సుండుపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సుండుపల్లె బీట్‌లోని సద్దికూలవంక చెక్‌పోస్ట్ వద్ద నాకాబందీ నిర్వహిస్తుండగా వేగంగా వచ్చిన ఒక కారు బారికేడ్ ఉన్న విషయాన్ని గుర్తించి సుండుపల్లె రహదారిలో పరారయ్యేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గ్రహించిన ఫారెస్టు అధికారులు, సిబ్బంది వెంబడించగా స్మగ్లర్లు కారును వదిలేసి పరారయ్యారన్నారు. ఈ కారులో 326 కిలోల బరువున్న 10 ఎర్రచందనం దుంగలను గుర్తించామన్నారు. దుంగలతో పాటు కారు విలువ రూ.6 లక్షలుంటుందని, ఈ దాడిలో పరారైన వారి కోసం తనిఖీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో రమేశ్‌బాబు, ఎఫ్‌బీవో అంజనస్వాతి, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో పాడి ఆవు మృతి

వాల్మీకిపురం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): స్థానిక నమాజ్‌కట్ట వీధికి చెందిన రెడ్డిబాష, అమ్మాజి దంపతులు కూలి జీవనంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. 8నెల ల కిందట రూ.50వేలు ఖర్చు చేసి ఓ పాడి ఆవును తెచ్చుని జీవిస్తున్నారు. రోజూ 15లీటర్లు పాలిచ్చే ఆవు మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా మృతి చెందింది. ఆ కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉండే ఆవు మృతి చెందడంతో వారు కన్నీటి పర్యంతమన్నారు. ప్రభుత్వం తమకు కనీస సాయం అందించాలని కోరుతున్నారు.

ఊరికే.. బస్సు

- రాష్ట్రం పరిధిలోనే మహిళలకు ఉచిత ప్రయాణం
- కొన్ని రకాల గుర్తింపు కార్డులే చెల్లుబాటు
- పథకానికి స్త్రీశక్తి పేరుగా ప్రచారం
- మహిళల కబుర్లలో ఆసక్తికర చర్చలు




కలికిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకంపై సర్వత్రా చర్చలు జరుగుతున్నాయి. నలుగురు మహిళల ఒకచోట కూడితే వారి కబుర్లలో ప్రధానంగా ఇదే అంశం చర్చకు వస్తోంది. ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. సూపర్ సిక్స్‌కు సంబంధించిన టీడీపీ ఎన్నికల హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఒకటి. దీని అమల్లో ఎక్కడా గందరగోళం తలెత్తకుండా ఆర్టీసీ అధికారులు కూడా పలు రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కేరళ, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణాల్లో ఈ పథకం అమల్లో ఉంది. ఏడాది కాలంగా ఈ రాష్ట్రాల్లో అమలవుతున్న తీరుతెన్నులు, సాదక బాధకాల గురించి ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేయించి ఆచితూచి అడుగు లేస్తోంది.

జిల్లాలో ఆర్టీసీ సమాచారం

జిల్లాలో మొత్తం ఐదు ఆర్టీసీ డిపోలున్నాయి. పీలేరు, మదనపల్లె, బి.కొత్తకోట, రాయచోటి, రాజంపేట నుంచి సర్వీసులు నడుస్తున్నాయి. ప్రస్తుతానికి ఈ డిపోల ద్వారా 545 బస్సులు అందుబాటులో ఉన్నాయి. రోజూ ఇవి లక్ష కిలోమీటర్లకు పైబడి తిరుగుతున్నాయని సమాచారం. ఈ సర్వీసుల ద్వారా రోజూ సరాసరిన లక్షా 40 వేల మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో మహిళా ప్రయాణికులే 50 వేల వరకు ఉన్నట్లు అధికారుల అంచనా. పట్టణ ప్రాంతాల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గ్రామీణ ప్రాంతాల కన్నా అధికంగా ఉంది. మొత్తం మీద 35 శాతం మహిళల ప్రయాణ వాటాగా ఉంది. ఉచిత బస్సు ప్రయాణంతో ఇది 50 శాతానికి మించి ఉంటుందని ఆర్టీసీ అంచనా వేస్తోంది. అందుకు అనుగుణంగా 15 నుంచి 20 శాతం బస్సులు, 40 శాతం సర్వీసులు పెంచేందుకు సమాయత్తమవుతున్నారు. రద్దీ ఉన్న చోట కొన్ని సర్వీసులు పూర్తిగా మహిళలకు కేటాయించనున్నారు.

సమాయత్తమవుతున్న ఆర్టీసీ

మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలు తేదీ దగ్గరపడే కొద్దీ ప్రధానంగా ఆర్టీసీలో హడావిడి మొదలైంది. మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులు, జోన్‌లు, రీజియన్ల వారీగా సమావేశాలు నిర్వహించి స్థానిక పరిస్థితులకు అనువుగా ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారు. క్షేత్ర స్థాయి అంచనాలను, ఎదురయ్యే అనుభవాలను విశ్లేషిస్తున్నారు. అన్ని డిపోల్లో కొత్త బస్సులు సమకూర్చేందుకు సమాయత్తం అవుతున్నారు. డిపోల్లో పక్కన పెట్టిన బస్సులను అవసరమైన మరమ్మతులతో సిద్ధం చేస్తున్నారు. కొన్ని మార్గాల్లో రద్దీకి అనుగుణంగా ఇప్పుడున్న సీట్లను మారుస్తున్నారు. మూడు వరుసల సీట్లు తొలగించి నిలుచోవడానికి అనువుగా రెండు సీట్లతో వరుసలు మారుస్తున్నారు. దీంతో డిపోల్లోని వర్క్ షాపుల్లో ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. జిల్లాలోని ఐదు డిపోలకు కనీసం వంద కొత్త బస్సులను సరఫరా చేస్తారని చెబుతున్నారు. మహిళలకు కేటాయించే సీట్లకు కూడా కొత్తగా రంగులు వేస్తున్నారు. బస్ స్టేషన్లలో మరుగుదొడ్ల మరమ్మతులతో పాటు అదనంగా కుర్చీలు, ఫ్యాన్లు, తాగు నీరు ఏర్పాటు చేస్తున్నారు. ఇక ప్రయాణికుల తాకిడి (పీక్ అవర్స్) సమయాల్లో అంటే ఉదయం 8-11, సాయంకాలం 4-7 గంటల మధ్య సర్వీసులు, వసతుల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మొత్తానికి అన్ని రకాల ఏర్పాట్లు 10వ తేదీకల్లా పూర్తి కావాలని డిపో అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.



స్త్రీశక్తి పేరుతో జనరేట్ చేసిన మోడల్ టికెట్టు

జీరో టికెట్ విధానం

మహిళా ప్రయాణికులకు జీరో టికెట్లు జారీ చేయనున్నారు. ప్రభుత్వం నుంచి ఉచిత పథకం నిధులు ఆర్టీసీ రాబట్టుకోవలసి ఉన్నందున జవాబుదారీ కోసం ప్రతి ప్రయాణికురాలికి టికెట్టు ఇవ్వడం తప్పనిసరి చేస్తున్నారు. దీనికి సంబంధించి జారీ చేసే టికెట్టు నమూనా విస్తృత ప్రచారంలో ఉంది. విజయవాడ నుంచి తిరువూరుకు రూ.120 టికెట్టు ధర ఉంది. రాయితీ రూ.120గా పేర్కొన్నారు. చెల్లించాల్సింది సున్నాగా చూపించారు. పై భాగాన పెద్ద అక్షరాలతో స్త్రీశక్తి అని ముద్రించారు. బస్సు నంబరు, డ్రైవరు నంబరు, ప్రయాణ దూరం, సీటు నంబరు ఇవన్నీ ముందున్నట్టే ఉన్నాయి. ఈ నమూనా టికెట్టు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. మహిళలు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుంది. కేవలం ఏపీకి చెందిన వారుగా ధ్రువీకరించుకోవడానికి మాత్రమే ఈ గుర్తింపు కార్డు అవసరమవుతుంది. మొత్తానికి ఆగస్టు నెలంతా అన్నదాత సుఖీభవ, కొత్త స్మార్ట్‌రేషన్ కార్డుల జారీ లాంటి భారీ సంక్షేమ పథకాల హడావిడిలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం కూడా సందడి చేయనుంది.

తాత్కాలిక డ్రైవర్ల నియామకాలు

అదనపు సర్వీసులకు అవసరమైన సిబ్బందిని కూడా ఆర్టీసీ సిద్ధం చేస్తోంది. కాల్ ఆన్ విధానంలో డ్రైవర్ల నియామకాల కోసం ఇప్పటికే అన్ని డిపోలు ప్రకటనలు జారీ చేశాయి. 21-40 ఏళ్ల మధ్య వయసు ఉండి, హెవీ వాహనాల లైసెన్సు కలిగి డ్రైవింగ్‌లో కనీసం 18 నెలల అనుభవం కలిగినవారు ఆర్టీఏ క్లియరెన్సు, ఇతర సర్టిఫికెట్లతో నేరుగా డిపో మేనేజరు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరుతున్నారు. కాగా మహిళలకు ప్రత్యేకంగా నడిపే సర్వీసులకు కండక్టర్ల అవసరం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రిన్సిపాల్ వేధింపులతో.. ఉపాధ్యాయురాలికి తీవ్ర అనారోగ్యం

- బాధితురాలి భర్త ఆవేదన


రాయచోటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయురాలు

వీరబల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వీరబల్లి కేజీబీవీ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు రామకృష్ణమ్మ బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆమెకు ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో సిబ్బంది వీరబల్లిలోని వైద్యుల వద్ద చూపించి చికిత్స నిమిత్తం రాయచోటికి తరలించారు. ఈ సందర్భంగా రామకృష్ణమ్మ భర్త ఆంజనేయులు మాట్లాడుతూ.. వీరబల్లి కేజీబీవీ ప్రిన్సిపాల్ సాయిదివ్య వేధింపులతో తన భార్య అనారోగ్యానికి గురయ్యారన్నారు. ప్రిన్సిపాల్ కొంతకాలంగా రామకృష్ణమ్మకు సీఎల్‌లు ఇవ్వడం లేదని, పాఠశాలకు సంబంధం లేని పర్సనల్ విషయాలతో తిడుతోందన్నారు. దీనిపై ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయన్నారు ప్రిన్సిపల్ ఇష్టారాజ్యంగా మాట్లాడడంతో రామకృష్ణమ్మ మనస్థాపానికి గురై కింద పడిపోయి అస్వస్థతకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జిల్లా అధికారుల సపోర్టు ఉందని సస్పెండ్ చేయిస్తానని ప్రిన్సిపాల్ బెదిరించేదని వాపోయారు. పిల్లల్ని టీసీలు ఇచ్చి పంపుతానని బెదిరిస్తోందని అన్నారు. ఈమె వల్ల పలువురు ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఇబ్బందులకు గురై బదిలీపై వెళ్లగా, ఒకరిని ఏకంగా ఉద్యోగం నుంచి తప్పించిందని పేర్కొన్నారు. ఈమెపై కలెక్టర్ చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. కాగా.. వీరబల్లి కేజీబీవీలో ప్రిన్సిపాల్‌కు, ఉపాధ్యాయురాలికి మధ్య జరిగిన సంఘటన గురించి విచారించామని ఎంఈవోలు వీర నాగయ్య, క్రిష్ణయ్య అన్నారు. ప్రస్తుతం రామకృష్ణమ్మ ఆరోగ్యం బాగుందని తెలిపారు. ఈ సంఘటనపై జిల్లా అధికారులకు తెలిపి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

కిలో టమోటా ధర రూ.52

గుర్రంకొండ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు రోజు రోజుకు పెరుగుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టమోటా ధరలు పది రోజులుగా పెరుగుతూ వచ్చాయి. బయట రాష్ట్రాల్లో టమోటా పంటలు దెబ్బతినడం, ఉన్న టమోటా తోటలు వర్షాలకు పూర్తిగా దెబ్బతిని కాయలు నాసిరకంగా మారాయి. దీంతో టమోటా పంటకు ధరలు వచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ క్రమంలో గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో కిలో టమోటా ధర రూ.52 పలికింది. ఈ లెక్కన 25 కిలోల టమోటా క్రేట్ ధర రూ.1300 గరిష్టానికి చేరుకొంది. టమోటా ధరలు పెరగడంతో రైతులు పంట సాగుపై బిజీబిజీగా ఉన్నారు. కాగా ధరలు పెరగడంతో వినియోగదారులు ఒకింత అసహనానికి గురవుతున్నారు.


గుర్రంకొండ మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

చేపల చెరువు వేలం సాగేనా ?

- గుట్టుచప్పుడు కాకుండా ఎలాగని మండిపాటు
- నేడు వేలం అంటూ దండోరా

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం పెద్ద చెరువు చేపల వేలం గుట్టు చప్పుడు కాకుండా నిర్వహణకు పంచాయతీ అధికారులు సన్నాహాలు చేశారు. మార్చి 19న చేపల చెరువు వేలం నిర్వహించగా ఆధిపత్య పోరుతో వేలాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామాల్లో ఎవరికీ తెలియకుండా దండోరా వేయకుండా వేలం ఎలా నిర్వహిస్తారని గ్రామస్తులు నిలదీశారు. దీంతో అప్పట్లో పంచాయతీ అధికారులు వేలాన్ని వాయిదా వేశారు. గ్రామస్తులతో చర్చించి వారం రోజుల ముందు గ్రామాల్లో దండోరా వేయించి వేలం నిర్వహిస్తామనడంతో నాడు గ్రామస్తులు వెనుదిరిగారు. ఇప్పుడు కొత్తగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి, అధికారులు అందుకు విరుద్ధంగా రాజకీయ నేతల అండదండలతో గుట్టు చప్పుడు కాకుండా పంచాయతీ తీర్మానం చేసుకుని మంగళవారం రాత్రి గ్రామాల్లో నామమాత్రంగా దండోరా వేయించి చేతులు దులిపేసుకున్నారు. పంచాయతీ నిబంధనల మేరకు వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి ఎటు వంటి బకాయిలు ఉండరాదని, ధరావత్తుగా రూ.87,500 చెల్లించాలని నిర్ణయించారు. ఇంత పెద్ద మొత్తంలో ధరావత్తు చెల్లించాలంటే తగిన సమయం ఇవ్వకుండా వేలం నిర్వహించడం పంచాయతీ ఆదాయానికి గండి కొట్టినట్లేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మార్చి 19న వేలం నిర్వహించిన సమయంలో వారికి అనుకూలంగా ఉన్న కొందరు ధరావత్తు సొమ్మును చెల్లించారు. అయితే ఆ ధరావత్తు సొమ్మును వెనక్కు తీసుకోకుండా పంచాయతీ అధికారుల వద్దే ఉంచుకుని కొత్తగా ధరావత్తు సొమ్మును కట్టించుకో కుండా గతంలో కట్టిన వారికే కట్టబె ట్టాలనే ఎత్తుగడలు వేసి గతంలో ఉన్న వారికే లబ్ధి చేకూర్చేందుకే ఇలా గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాట్లు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నాలుగు లారీలు సీజ్


మైన్స్ అధికారులు సీజ్ చేసిన లారీలు

రామసముద్రం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులోని క్వారీలో తరలిస్తున్న నాలుగు లారీలను సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించినట్లు మదనపల్లె మైన్స్ అధికారులు తెలిపారు. గత కొంతకాలంగా గొల్లపల్లె సమీపంలోని గుట్టలో చేతివృత్తుల వారు రాళ్లు కొట్టుకుని జీవనోపాధి పొందుతున్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని కొంత మంది అనుమతులు లేకుండానే పెద్ద ఎత్తున రాళ్లను పగులగొట్టి ఇటుకల పరిమాణంలో రాళ్లను కర్ణాటక, తమిళనాడుకు తరలిస్తున్నట్లు మైన్స్ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి రాళ్లను లారీలలో నింపి తరలిస్తుండగా దాడులు చేసి లారీలను సీజ్ చేసినట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తగు చర్యలు తీసుకుంటామని మైన్స్ అధికారులు తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట


ప్రేమ జంటతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన చలమాల నవీన్ కుమార్, పులివెందుల మండలం భాకరాపురం గ్రామానికి చెందిన సయ్యద్ మనీషా వివాహం చేసుకుని బుధవారం సాయంత్రం నందలూరు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కథనం మేరకు వీరిద్దరూ ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారని, బుధవారం రాజంపేట సమీపంలోని పోలిచెరువు కట్టపై ఉన్న అంజనేయస్వామి గుడిలో పెళ్లి చేసుకుని రక్షణ కోసం తమను ఆశ్రయించారని తెలిపారు. ఇద్దరూ మేజర్లు కావడంతో ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

కంచె ధ్వంసం- కేసు నమోదు


పొలంలో దౌర్జన్యంగా ధ్వంసం చేసిన కంచె

రాజంపేటటౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తన పొలానికి వేసుకున్న కంచెను ముగ్గురు వ్యక్తులు ధ్వంసం చేశారంటూ మండల పరిధిలోని మిట్టపల్లికి చెందిన ఈశ్వరరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు ఈశ్వరరాజుకు అదే గ్రామానికి చెందిన వెంకటరాజు, లక్ష్మీకరరాజు, భానుప్రకాష్‌రాజు మధ్య భూవివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈశ్వర్‌రాజు సమస్య పరిష్కరించుకోకుండానే పొలం చుట్టూ కంచె వేయడంతో దానిని వారు ధ్వంసం చేశారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు మన్నూరు సీఐ కుళాయప్ప తెలిపారు.

యువకుడిపై కుక్క దాడి


గాయపడ్డ ప్రవీణ్

సిద్దవటం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కుక్క దాడి చేయడంతో ఓ యువకుడు గాయపడ్డాడు. మండలంలోని టక్కోలి ఎస్సీ కాలనీకి చెందిన ప్రవీణ్ అనే యువకుడిపై బుధవారం కుక్క దాడి చేయడంతో చేతులు, మెడ భాగాల్లో గాయాలయ్యాయి. దీంతో అతను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స చేయించుకున్నాడు. ఈ కుక్క ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారిపై దాడి చేస్తోందని, దీనిని పట్టుకుని ఊరికి దూరంగా తరలించాలని బాధితుడితో పాటు పలువురు అధికారులను కోరుతున్నారు.

బొప్పాయి దళారుల దాగుడుమూతలు....!

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- రైతుల ఆందోళన


రైతుల ఉద్దేశించి మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భావన

రైల్వేకోడూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ నిర్ణయించిన ధరలను దళారులు చెల్లించడం లేదంటూ బుధవారం బొప్పాయి రైతులు కోతలను నిలిపివేశారు. బొప్పాయి తోటల వద్దకు వచ్చిన లారీలను వెనక్కి పంపించారు. రైల్వేకోడూరులోని దళారీలందరూ సిండికేటుగా ఏర్పడి టన్ను బొప్పాయి కాయలకు రూ. 7,000 మాత్రమే చెల్లిస్తున్నారంటూ గత నెల 31న రైల్వేకోడూరులో బొప్పాయి రైతులు ఎత్తున ఆందోళన చేశారు. పలు రకాలుగా నిరసన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ చామకూరి శ్రీధర్, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి స్పందించి ఈ నెల 1న ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో రైతులు, దళారీలు, మార్వాడీలతో సమావేశం నిర్వహించారు. నాలుగు గంటల చర్చల అనంతరం టన్ను ధర రూ.9 వేలకు తక్కువ కాకుండా కోతలు కోసేందుకు అందరూ ఒప్పుకున్నారని కలెక్టర్ శ్రీధర్ ప్రకటించారు. 5వ తేదీ తర్వాత టన్ను రూ.10 వేలు చేస్తారని తెలిపారు. అయితే ఢిల్లీలో వర్షాలు తగ్గుముఖం పట్టినా, అక్కడ వర్షాలు కురుస్తున్నాయన్న సాకు చెప్పి దళారులు టన్ను ధర రూ.8 వేలు చేశారని రైతులు అధికారులకు విన్నవించారు. ఈ విషయం టీడీపీ ఇన్‌చార్జి, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

సబ్ కలెక్టర్ ఆరా..

రైల్వేకోడూరులో బొప్పాయి ధర టన్ను రూ.8 వేలకు తగ్గించారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలియడంతో, ఆయా వర్గాలతో చర్చించి సమస్య పరిష్కరించాలని కలెక్టర్ రాజంపేట సబ్ కలెక్టర్ భావనను ఆదేశించారు. దీంతో ఆమె బుధవారం సాయంత్రం రైల్వేకోడూరు రెవెన్యూశాఖ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సుబ్బరామరాజు, ఆదినారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో సుమారు 100 మంది బొప్పాయి దళారులు ఉన్నారని, వీరంతా సిండికేట్ అయి రైతులను నిలువునా మోసం చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలను దళారులు బేఖాతరు చేస్తున్నారని తెలిపారు. దళారీ రమేష్‌బాబు మాట్లాడుతూ రైతుల ఆందోళన తర్వాత మార్వాడీలు, దళారులు, రైతులకు మధ్య గ్యాప్ వచ్చిందన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రైతులు అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇక్కడ జరిగిన విషయాలను కలెక్టర్‌కు వివరిస్తామన్నారు. టన్ను బొప్పాయి కాయలను రూ. 9కు తగ్గకుండా చెల్లించాలని దళారులను ఆదేశించారు. రేపటి నుంచి టన్ను రూ.10 వేలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్, ఉద్యానశాఖాధికారి భాస్కర్, మార్కెటింగ్ కార్యదర్శి లక్ష్మీకాంత్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మానస, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గల్లా రమణ, సీఐ కె.హేమసుందర రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరుణాకర్‌రెడ్డికి ఘన సన్మానం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీలో 2024-2025 ఏడాదికి సంబంధించిన రైతులకు ఉత్తమ సేవలు అందించిన మదనపల్లె సింగిల్ విండో సీఈఓ కరుణాకర్ రెడ్డికి తగిన ప్రతిఫలం లభించిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఉత్తమ అవార్డు గ్రహీతగా ఎంపిక చేశారని అన్నారు. బుధవారం మదనపల్లె సింగిల్ విండో కార్యాలయంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి మధుబాబు, మదనపల్లె 1,2 డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి, సోముశేఖర్, మురళి, మధు, నాగేంద్ర, ప్రవీణ్, రాయల్, మహేష్, జగదీష్ పుష్పగుచ్ఛాలను అందించి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.


కరుణాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

సాంప్రదాయ సంస్కృతికి ప్రతీక చేనేత


చేనేత మగ్గం

- సాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర
- నేడు నేతన్నల పరిస్థితి దయనీయం
- ప్రభుత్వాల సాయం అంతంతే..
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మనదేశ సంస్కృతీ సాంప్రదాయాలకు విశిష్టమైన ప్రతీక చేనేత రంగం. 1905 ఆగస్టు 7న బెంగాల్‌లో మొదటిసారిగా విదేశీ వస్త్ర బహిష్కరణ ప్రారంభించబడింది. అంతేకా కుండా స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత కార్మికులు చురు గ్గా పాల్గొని స్వతంత్ర్య స్ఫూర్తి ని రగిలించారు. ఈ క్రమం లో భారతప్రధాని నరేంద్రమోడీ 2015 ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవా న్ని మనం జరుపుకుంటున్నాం. వ్యవసాయరంగం తరు వాత అత్యధిక శాతం ప్రజలు చేనేతరంగంపై ఆధార పడి జీవించేవారు. అయితే కాలక్రమంలో నేత వస్త్రాలకు డిమాండ్ తగ్గడం, తయారీకి ఖర్చు పెరగడంతో ఆ రంగం నష్టాల ఊబిలో కూరుకుపోతోంది. గతంలో చేనేత కార్మికులకు చేతినిండా పని ఉండేది. అయితే ముడిస రుకు ధర పెరిగిపోవడం, కొనుగోలుదారులు తగ్గిపోవ డంతో పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో పట్టుచీరలకు నేత కార్మికులకు ఒక్కో చీర నేసేందుకు రూ.4వేలు వరకు కూలీ లభించేది. అయితే మరమగ్గాలు వచ్చినప్పటి నుంచి చేనేత వస్త్రాలకు డిమాండ్ తగ్గడం వల్ల వీరికి పనిలేకుండాపోతుంది. ఇప్పుడు ఒక్క చీర నేస్తే రూ.2వేలు ఇస్తున్నారు. నెలకు నాలుగు చీరల వరకు నేస్తారు, ఈ లెక్కన రూ.8వేలు మాత్రమే చేనేత కూలీలకు దక్కుతుంది. దీని వల్ల కుటుంబ పోషణ భారంగా మారడంతో ప్రభుత్వసాయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి.

జిల్లాలో 15100 మంది చేనేత కార్మికులున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీరిలో స్వయంగా మగ్గా లపై 7165 మంది పనిచేస్తుండగా సహకార సంఘాల ద్వారా 7935 మంది మగ్గం పనులు చేస్తున్నారు. జిల్లాలో చేనేత, సిల్క్ సహకార సంఘాలు 210 వరకు పనిచేస్తు న్నాయి. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మాధవరం, బద్వేలు, ఖాజీపేట, కమలాపురం ప్రాంతాల్లో ఎక్కువగా చేనేత మగ్గాలు, సహకర సంఘాలు ఉన్నాయి. జమ్మల మడుగులో ఎక్కువగా పట్టుచీరలు, కాటన్ చీరలు, దూపి యాన్ పట్టు, లివరీ వస్త్రాలు తయారు చేస్తారు. ప్రొద్దు టూరు నియోజకవర్గంలో దూపియాన్ సిల్క్,


చేనేత వస్త్రాలు

లివరీ సిల్క్ చీరలు, దోతీలు తయారు చేస్తారు. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో దూపియాన్ సిల్క్‌తో పాటు సిల్క్ చీరలు, లివరీ నేత పనులు చేస్తారు. బద్వేలు నియోజక వర్గంలో బద్వేలు సికో చీరలు, లివరీ నేస్తారు. పులివెం దుల నియోజకవర్గంలో పట్టుపావడాలు, పట్టుచీరలు, కమలాపురం నియోజకవర్గంలో పట్టుచీరలు, లివరీ, రాజంపేట నియోజకవర్గంలోని మాధవరంలో సిల్క్ కాట న్‌చీరలు, కడప నియోజకవర్గంలో పట్టుచీరలు నేస్తారు.

చేనేతరంగానికి ఊతం

అత్యధికంగా చేనేత కార్మికులు ఉన్న జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రాంతా ల్లోని చేనేత రంగాల్లోని కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు మార్కెటింగ్ సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏపీ ప్రభుత్వం 2005-06 సంవత్సరంలో మైలవరంలో టెక్స్‌టైల్ పార్కును మంజూరు చేసింది. రూ.7.38 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. వేపరాల, మైలవరం, దొమ్మరనంద్యాల, మోరగుడి, జమ్మలమడుగు, కన్నెలూరు ప్రొద్దుటూరు ప్రాంతాల్లోని చేనేత పవర్‌లూమ్ క్లస్టర్ల రద్దీని తగ్గించేం దుకు యూనిట్లను తరలించేందుకు సహాయపడడానికి టెక్స్‌టైల్ పార్కు ప్రధాన భూమిక పోషించనుంది.

రుణాలు ఇచ్చి ఆదుకోవాలి



30 సంవత్సరాలుగా నేత పని చేస్తున్నాను. మగ్గం పని తప్ప ఇతర ఏ పని చేతకాక పోవడంతో చేనేతే ఆదరువుగా నిలుస్తుంది. కానీ మరమగ్గాలు వచ్చిన తరువాత చేనేత వస్త్రాలకు డిమాండ్ తగ్గింది. మరమగ్గాలపై రోజుకు 3 చీరలు నేస్తే చేనేత ద్వారా వారానికి ఒకచీర నేస్తాం. ఈ క్రమంలో ప్రభుత్వం చేనేతలను ఆదుకునేందుకు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలి.

-పొట్ట శివకుమార్, చేనేత కార్మికుడు, మాధవరం

చేనేత వస్త్రాలకు మంచిగిరాకీ



చేనేత వస్త్రాలకు మంచి గిరాకీ ఉంది. తరతరాలుగా మా కుటుంబం ఈ వ్యాపారంపైనే ఆధారపడి ఉంది. సొంతంగా మగ్గాలు పెట్టి వస్త్రాలను నేయించడంతో పాటు ఇతర ప్రాంతాల్లో నేసిన వస్త్రాలను తీసుకు వచ్చి మా దుకాణం ద్వారా విక్రయాలు చేపడు తున్నాం. చాలా వరకు తక్కువ మార్జిన్ పెట్టుకుని విక్రయించడం వల్ల ఎక్కువ మంది కొనుగోలు దారులు వస్తున్నారు.

-ఈశ్వర్, చేనేత వస్త్రవ్యాపారి, మాధవరం

చేనేత కార్మికులకు ప్రయోజనాలు

జిల్లాలోని చేనేత కార్మికులకు 9116 మందికి 4వేల చొప్పు న ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పింఛను అందజేస్తారు. అదే విధంగా చేనేత కార్మికులకు ఆర్థిక సాయం అందించే క్రమంలో 2016 సెప్టెంబరు 1 నుంచి ముద్ర రుణాలు అందిస్తుంది. కాటన్ సిల్క్ రకాల దుస్తులను ఉత్పత్తి చేసే నేత కార్మికులకు బ్యాంకుల నుంచి ఐదులక్షల వరకు, మార్జిన్ మనీ సహాయంతో 20శాతం గరిష్టంగా 25వేల రూపాయలు నోడల్ బ్యాంకు అయిన పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా సహాయం అందజేస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 1133 ముద్ర రుణాలు లక్ష్యంగా నిర్దేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 933 మందికి ముద్ర రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేనేత రంగానికి సబ్సిడీలు పూర్తిస్థాయిలో నిలిపివేసింది. ఈ క్రమంలో చేనేత సహకార సంఘాలు సైతం నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక నేత కార్మికుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది.

నేతన్నకు కావాలి.. మరింత చేయూత

నేటి నుంచి ఉచిత విద్యుత్తు అమలు

మదనపల్లె, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సంక్షోభం, ఒడిదొడుకుల మధ్య సాగుతున్న నేతన్నలకు కూటమి ప్రభుత్వం చేయూతతో ఊపిరిపీల్చుకుంటున్నారు. చేనేత రంగానికి ఉచిత విద్యుత్తు ప్రకటనతోపాటు జాతీయ చేనేత దినోత్సవాన్ని పురష్కరించుకుని గురు వారం నుంచి హామీని ప్రభుత్వం నిలబెట్టు కుంటోం ది. ఇందులోభాగంగా చేనేత మగ్గాలకు విద్యుత్తు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తును అమలు చేస్తోంది. అలాగే జీఎస్టీ నుంచి చేనేత రంగాన్ని మినహాయించడం శుభపరిణా మంగా చెప్పాలి. జాతీయ చేనేత దినోత్సవం సంద ర్భంగా చేనేత రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కార్మికులు పడుతున్న కష్టాలు, ముడిసరుకు ధరలు, మార్కెటింగ్ సౌకర్యంపై ప్రత్యేక కథనం.

వ్యవసాయం, పాడిపరిశ్రమ తర్వాతి స్థానాన్ని చేనేత రంగంగా చెప్పవచ్చు. కాలక్రమేణా చేనేత రంగం కూడా కళతప్పుతోంది. మల్బరీసాగు ఏటికేడు తగ్గిపోవడం, మార్కెట్‌లో ముడిసరుకు ధరలు విపరీతంగా పెరిగిపోవడం, చేనేత స్థానంలో పవర్ లూమ్స్ రావడం కూడా కారణంగా చెబుతున్నారు. అలాగే ఈ రంగంలోకి కొత్తగా వచ్చే యువత, కార్మి కులు తగ్గిపోవడం, నైపుణ్యమైన కార్మికులు అందుబా టులో లేకపోవడం కూడా మరో కారణమని చెప్పాలి. మరోవైపు మార్కెట్‌లో పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని చేనేత రంగం అందుకోలేక పోవడమే కాదు.. పవర్‌లూమ్‌కు దీటుగా డిజైన్లు అందిపుచ్చు కోలేకపోతోంది. చేనేత పరిశ్రమ పదికాలాలపాటు పదిలంగా ఉండాలంటే కార్మికులు, మాస్టర్‌వీవర్స్‌కూ ప్రత్యేకమైన శిక్షణతో పాటు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సి వుందని ఆ రంగం నిపుణులు కోరుతున్నారు.

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె,



తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. వీరిలో మదనపల్లె నీరుగట్టువారిపల్లెలో ఎక్కువగా ఉన్నారు. తర్వాత తంబళ్లపల్లె, బి.కొత్తకోట, ములకలచెరువు, గాలివీడు, వీరబల్లి, మట్లి, సంబేపల్లె, తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. జిల్లాలో మొత్తంగా తీసుకుంటే 20వేలకుపైగా చేనేతలు, 10వేలు పవర్‌లూమ్స్ ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నారు. ఇలా మొత్తమ్మీద తీసుకుంటే చేనేత రంగంపై ప్రత్యకంగా, పరోక్షంగా లక్షమందికిపైగా ఆధారపడి జీవిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జీఎస్టీ, ఉచిత విద్యుత్తుతో ఆయా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ఇన్‌స్పెక్టర్ మృతి


మోహన్ (ఫైల్)

జమ్మలమడుగు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ఇన్‌స్పెక్టర్ మోహన్ (52) మృతి చెందారు. ఈయన ఆలయంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇన్‌స్పెక్టర్ హోదాలో విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఆలయంలో ఉండగా.. 11 గంటల సమయంలో ఓఫోన్‌కాల్ రావడంతో మాట్లాడుతూ కుప్పకూలిపోయాడు. వెంటనే అక్కడున్న సిబ్బంది వారి కుటుంబీకులకు సమాచారం అందించి స్థానికంగా ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం నంద్యాల శాంతిరాం ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి జాతీయ రహదారి గోటూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. కడప నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న బస్సు ఎర్రగుంట్ల నుంచి కడపకు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీనడంతో ద్విచక్ర వాహనదారుడికి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వల్లూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. ద్విచక్రవాహనదారుడు ఖాజీపేట మండలం అప్పనపల్లెకు చెందిన చౌడయ్యగా గుర్తించారు. ఇతను ఎర్రగుంట్లలో బంధువుల ఇంటి నుంచి కడపలో తాను పని చేస్తున్న జ్యువెలరీ షాపునకు వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొండాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గండికోట బ్యాక్ వాటర్‌లో బుధవారం గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... కొండాపురం రైల్వే బ్రిడ్జి సమీపంలో గండికోట బ్యాక్‌వాటర్‌లో 20-23 సంవత్సరాల వయసు గల యువకుని మృతదేహం స్థానికులు గుర్తించారు. ఈ యువకుడు నల్లఫ్యాంట్, గల్ల చొక్క ధరించి వున్నాడు. అతడు ఏ ప్రాంతం వాడని తెలియరాలేదు. స్థానికుల సహాయంతో పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. వీఆర్‌వో నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎవరైనా వివరాలు తెలిస్తే 9121100611, 9121100612 ఫోన్ నెంబర్లకు తెలయజేయాలన్నారు.

మహిళ అదృశ్యం

బి.కోడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన కొండా దొరసానమ్మ (32) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ వెంకటసురేశ్ తెలిపారు. ఆమె మానసిక స్థితి సరిగాలేక ఈనెల 3వ తేదీ ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్లు ఆమె తం డ్రి కొండా వెంకటరామిరెడ్డి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిషన్ శక్తితో మహిళా సాధికారత : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మిషన్ శక్తి కార్యక్రమం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్‌శక్తిలో సంబల్ మరియు సామర్థ్య ఉప పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు సంబల్ పథకం మహిళల భద్రతకు, సమర్థ్య పథకం మహిళల సాధికారత కోసం ఏర్పాటు చేసిందన్నారు. వన్‌స్టాప్ సెంటర్ల ద్వారా చట్టపరమైన కౌన్సెలింగ్, మానసిక సామాజిక కౌన్సెలింగ్‌లు అందించాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు అవగాహన కల్పించాలన్నారు. సమర్థ్య పథకంలో భాగంగా బాధిత మహిళలకు పునరావాసం కల్పించే శక్తి సదన్‌లు కడపలో 3, మైదుకూరులో 1 పని చేస్తున్నాయన్నారు. జిల్లాలో శక్తి సదన్లను బలోపేతం చేసి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి నైపుణ్య శిక్షణలు, ఉపాధి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద మొదటిసారి ప్రసవానికి రూ5 వేలు, రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే రూ.6వేలు అందిస్తోందన్నారు. మహిళల పరిరక్షణకు 181 ఉమెన్ హెల్ప్‌లైన్ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, రైల్వే, హాస్పిటల్స్‌లో మదర్ ఫీడింగ్ రూములను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, పిల్లల సమస్యల కోసం పాఠశాలల్లో సి బాక్సులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మహిళ శిశు సంక్షేమం సాధికారత అధికారి రమాదేవి, సోషల్‌వెల్ఫేర్ డీడీ సరస్వతి, డీఈవో షంషుద్దీన్, స్టెప్ సీఈవో సాయి గ్రేస్, సీపీవో హజరత్తయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు చేసిన చోట బోర్డులు ఏర్పాటు చేయాలి


ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

చెన్నూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉపాధి పనులు ఎక్కడ చేపట్టినా పనిచేసిన చోట ఆ పని విలువ, ఏ పని చేశాం, ఎంత దూరం చేశామనే సూచించే బోర్డులు తప్పక ఏర్పాటు చేయాలని జాతీయస్థాయి పర్యవేక్షణ బృందం కేంద్ర కమిటీ సభ్యులు చూడామణిరెడ్డి, దివాకర్‌రెడ్డిలు అన్నారు. బుధవారం చెన్నూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు, గోకులాలు కట్టుకున్న రైతులు ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డులు సరిగా ఉన్నాయా... వాటికి తగినట్లు పనులు కల్పిస్తున్నారా.. దినసరి కూలీ ఎంత పడుతోంది.. కూలీ ఎలా ఇస్తున్నారు.. వంటి వాటిపై అడిగి తెలుసుకున్నారు. అలాగే గోకులాల బిల్లులు వచ్చాయా.. ఒక్కో గోకులం షెడ్డులో ఎన్ని బర్రెలు, ఆవులు ఉన్నాయి అని ఆరా తీశారు. అలాగే పక్కాగృహాలు నిర్మించుకున్న వారికి సకాలంలో బిల్లులు అందించారా.. లేదా అని తెలుసుకున్నారు. అనంతరం చెన్నూరు, కొండపేట గ్రామాల్లో నిర్మించిన రోడ్ల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో గంగాదేవి, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, ఏపీడీలు రామలింగారెడ్డి, సుబ్బారెడ్డి, ఆనంద్, , సర్పంచ్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ సహ ఆచార్యుడికి సత్కారం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అలెగ్జాండర్ వాన్ హంబో ల్ట్ (ఏవీహెచ్) పోస్టు డాక్టోరల్ ఫెలో డాక్టర్ పి.వాసు గోవర్ధనరెడ్డిని జర్మనీలోని హంబోల్ రెన్యూడ్ రీసెర్చ్ ఫెలోషిప్‌తో సత్కరించారు. అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ ఫౌండేషన్ ప్రదానం చేసిన ఈ ప్రతి ష్టాత్మక ఫెలోషిప్ ఈ ఏడాది మే 1 నుంచి జూలై 31 వరకు మూడు నెలల రెన్యూడ్ రీసోర్చ్ ఫెలోషిప్‌ను జర్మనీలో పూర్తి చేశారు. ఈయన ప్రొఫెసర్ రెనె విల్హెల్మ్ మార్గదర్శకత్వంలో అసమాన ఆర్గానో క్యాటాలిసిస్లో తన పరిశోధన చేశారు. తన ఫెలోషిప్ సమయంలో, డాక్టర్‌రెడ్డి ఎన్-హెపిరో సైక్లిక్ కార్బెనెస్ (ఐఎన్సీలు)లు వాటి ఉత్ప్రేరక అనువర్తనాల పనితీరును గుర్తించారు. డాక్టర్ పి.వాసుగోవర్ధనరెడ్డి అనేక ప్రొఫెషన్లు, నెట్‌వర్కింగ్ ఈవెంట్లలో భాగస్వామ్యులయ్యారు. విజయ వంతంగా పరిశోధన పూర్తి చేసుకున్న డాక్టర్ వాసు గోవర్ధన్‌రెడ్డిని వైవీ యూ ఉపకులపతి శ్రీనివాసరావు, కులసచివులు పి.పద్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

మళ్లీ విరిగిన ధ్వజస్తంభం


- కనుపర్తి రామాలయం వద్ద ఘటన



చెన్నూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుపర్తి గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠలో అపశ్రుతి చోటు చేసుకుంది. బుధవారం రామాలయం ఎదుట ప్రతిష్ఠ కోసం ధ్వజస్తంభాన్ని క్రేన్ సాయంతో పైకి ఎత్తగానే విరిగి రెండు ముక్కలైంది. దీంతో దాత భాస్కర్‌రెడ్డి మనోవేదకు గురయ్యారు. ఈ ఏడాది జూన్ 6న ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించడానికి క్రేన్‌తో పైకి ఎత్తగానే విరిగి మూడు ముక్కలైంది. రెండు నెలల తరువాత మళ్లీ బుధవారం మరో ధ్వజస్తంభం తెప్పించి.. పూజా కార్యక్రమాలు చేసి ప్రతిష్ఠించేందుకు పైకి ఎత్త గానే మళ్లీ విరిగి రెండు ముక్కలైంది. దీంతో దాత భాస్కర్‌రెడ్డి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు.

ఆర్టీసీ బస్సు కిందకు దూసుకెళ్లిన స్కూటర్

- సురక్షితంగా బయటపడిన కడపవాసి



తిరుమల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో బుధవారం పెను ప్రమాదం తప్పింది. కడపకు చెందిన ధనుంజయరెడ్డి బుధవారం మధ్యాహ్నం తిరుమల నుంచి తిరుపతికి బయలుదేరారు. 29వ మలుపు వద్ద ముందువెళుతున్న ఆర్టీసీ బస్సును దాటే క్రమంలో బస్సును ఢీకొన్నారు. ఆయన కుడివైపు పడగా.. ఎడమవైపు పడిన ద్విచక్రవాహనం బస్సు కిందకు వెళ్లిపోయింది. భారీ శబ్ధం రావడంతో బస్సు ఆగిపోయింది. అదృష్టవశాత్తు ధనుంజయరెడ్డి కుడివైపు పడటంతో ప్రమాదం తప్పింది. ద్విచక్రవాహనమే ఎడమవైపు ఓవర్‌టేక్ చేసే క్రమంలో తన బస్సును ఢీకొందని, తనది ఏ తప్పు లేదని బస్సు డ్రైవర్ నాగరాజు చెప్పారు. ఈ ఘటనతో కొద్ది సమయం ట్రాఫిక్ స్తంభించింది.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

ఇంట్లో ఊయలకు వేలాడుతూ కనిపించిన మృతదేహం


మృతి చెందిన షేక్ ఇమాంబి, చిన్నారి మెడ చుట్టూ కందిపోయిన దృశ్యం

ఎర్రగుంట్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రాణీవనం పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న షేక్ ఇమాంబి(9) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బాలిక తండ్రి షేక్ ఆలీ వివరాల మేరకు.... ఎర్రగుంట్ల మున్సిపాలిటీ వినాయకనగర్‌లోని చేపల బజార్‌లో నివాసం ఉంటున్నాం. ఇమాంబి రాణీవనంలోని పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. బుధవారం తెల్లవారుజామున తాను గనిపనికి వెళ్లానని.. తన భార్య మహబూబ్‌బీ ఉదయం 7.30 గంటలకు బేల్దారి పనికి వెళ్లిందన్నారు. అయితే పాప స్కూల్‌కు వెళ్లింది లేనిది తనకు తెలియదన్నారు. మధ్యాహ్నం 3గంటలకు ఇంటి కొచ్చి చూడగా... ఇంటిలో కొక్కికి ఉన్న ఊయలకు వేలాడుతూ పాప కుర్చీలో పడిపోయి ఉంది. పలకరించినప్పటికీ పలకకపోవడంతో వెంటనే బయట ఉన్న మంచంపై పడుకోబెట్టాను. పక్కింటి వారి సహాయంతో ఆర్‌ఎంపీ వద్దకు తన కుమార్తెను తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు తెలి పారు. ఈ విషయం తెలిసిన సీఐ నరేష్‌బాబు, పోలీసు బృందం వినాయకనగర్‌లోని ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. బాలిక ప్రమాదవశాత్తు మృతి చెందిందా లేక ఏవైనా కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, ఇమాంబీ బుధవారం పాఠశాలకు రాలేదని ఉపాధ్యాయ వర్గాలు తెలిపాయి. దీంతో చిన్నారి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల వద్దకు చేరిన బాలుడు

మైదుకూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలుడు రిషిని ఆర్టీసీ ఉద్యోగి అతని తల్లిదండ్రుల వద్దకు చేర్చిన సంఘటన బుధవారం మైదుకూరులో జరిగింది. ఆర్‌టీసీ డిపో క్లర్క్ లక్షుమయ్య, పోలీసుల వివరాల మేరకు... అనంతపురం జిల్లా గుత్తికి చెందిన కావడి సతీష్, రూతుకు ముగ్గురు సంతానం. వారిలో కుమారుడు రిషి(12) అనే బాలుడిని రెండు రోజుల క్రితం తల్లిదండ్రులు గట్టిగా మందలించడతో ఇంటి నుంచి పారిపోయి మైదుకూరు బస్టాండ్‌కు చేరుకున్నాడు. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో రిషికి ఆకలి వేయడంతో తిరుపతికి వెళ్లే బస్సులో డబ్బులు అడుక్కుంటున్నాడు. అదే సమయంలో ఖాజా అనే వ్యక్తి బస్సు ఎక్కాడు. అయితే అతను తన సెల్‌ఫోన్ కనిపించడం లేదని, అది రిషినే తీశాడని పక్కనే ఉన్న పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లాడు. అయితే బాలుడు దొంగతనం చేసినట్లు కనిపించడం లేదని భావించిన ఆర్‌టీసీ డిపో క్లర్క్ లక్షుమయ్య వారి వెంట వెళ్లాడు. అక్కడ నుంచి ఖాజా సెల్‌ఫోన్‌కు పోలీసుల చేత కాల్‌చేయించారు. అవతలి వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి మీ సెల్‌ఫోన్ తన వద్ద ఉందని, నాకు బస్సులో దొరికిందని తెలిపాడు. దీంతో సెల్‌ఫోన్ కడపలోని ఆర్‌టీసీ విచారణ కౌంటర్‌లో ఇవ్వాలని సూచించారు. దీంతో బాలుడు దొంగతనం చేయలేదని తెలుసుకున్న ఖాజా క్షమాపణలు చెప్పి వెళ్లిపోయా రు. ఆర్టీసీ క్లర్క్ లక్షుమయ్య పోలీసుల వద్ద అనుమతి తీసుకొని, ఆ బాలుడికి టిఫెన్ తినిపించి, అతని తల్లిదండ్రుల సమాచారం తెలుసుకున్నారు. అనంతరం వారికి ఫోన్ చేసి బాలుడిని పోలీసుల సాయంతో వారి వద్దకు పంపాడు.

'ప్రకృతి' ద్వారా ఎక్కువ దిగుబడులు



విత్తు విధానాన్ని వివరిస్తున్న అధికారులు

పీలేరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం(సేంద్రీయ వ్యవసాయం) ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చనే విషయం రైతులకు తెలియజేయాలని వ్యవసాయ శాఖ పీలేరు ఏడీ రమణరావు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు. పీలేరు, కేవీపల్లె మండలాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ప్రకృతి వ్యవసాయం(సేంద్రీయ వ్యవసాయం)పై బుధవారం బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవవడ్డిపల్లెలోని రైతు చంద్రశేఖర్ పొలంలో శిక్షణ నిర్వహించారు. సహజ పదార్థాలతోనే ఎరువులు, పురుగుల మందులు తయారు చేసుకోవచ్చని సూచించారు. తద్వారా పర్యావరణానికి కూడా మేలు చేయవచ్చని విషయం రైతులకు తెలియజేయాలన్నారు. వ్యవసాయ శాఖ, ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనజీవామృతం, విత్తన గుళికలు, నీమాస్త్రం తయారీ వంటి సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల గురించి సమగ్రంగా తెలియజేశారు. కేవీ పల్లె, పీలేరు మండలాల్లోని రైతే సేవా కేంద్రాల్లోని సిబ్బందికి శిక్షణ జరిగింది. ఏఓలు రమాదేవి, మాధవి, సేంద్రీయ వ్యవసాయ సిబ్బంది సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఎస్టీయూ నేతలు

రామసముద్రం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు బుధవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చెంబకూరు, మట్లవారిపల్లె, రామసముద్రం ఉన్నత పాఠశాలలో గతేడాది అత్యధిక మార్కులు సాధించిన 25మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి ప్రధాన కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం, పేద విద్యార్థుల చేయూతకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతేడాది టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేసిన ఎస్టీయూ ఈ సారి ప్రోత్సాహక బహుమతులు ఇచ్చినట్లు తెలిపారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు డీఏల మంజూరు, పెండింగ్ బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, మండల అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఆర్థిక కార్యదర్శి సురేష్, మహ్మద్‌ఖాన్, నరసింహులు, సుబ్బారెడ్డి, చంగల్రాయ్‌చారి, ప్రకాష్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, మహిధర్‌రావు, సుధాకర్, కేశవకుమార్, మనోహర్, అనిల్‌కుమార్, మహ్మద్‌బేగ్, బాలాజి, వై. నరసింహులు, కుసుమ, జ్యోతి, మంజుల, ఆశాజ్యోతి, సయ్యద్‌బాషా, కృష్ణమూర్తి, కృష్ణయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను వేధిస్తే చర్యలు తప్పవు

రెవెన్యూ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

మదనపల్లె టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సేవల కోసం కార్యాలయానికి వచ్చే రైతులను అధికారులు వేధిస్తే వారిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే షాజహాన్ బాష ఆగ్రహించారు. బుధవారం వేంపల్లె గ్రామంలో సుపరిపాలన-తొలిఅడుగులో ఎమ్మెల్యేతో కొందరు రైతులు మాట్లాడుతూ పాసుపుస్తకాలు, సర్వే పనుల కోసం చలానాలు కట్టినా రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించడం లేదని ఆరోపించారు. ఎక్కువ సార్లు కార్యాలయానికి వస్తే మీ పనులు జరగవని అధికారి చెబుతున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ పిత్రార్జితం వచ్చిన భూములకు మ్యుటేషన్ చేయడంలో రెవెన్యూ అధికారులు ఆలసత్వం ప్రదర్శిస్తే వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సర్వే పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా అధికారులను ఆదేశిస్తామన్నారు. అనంతరం వేంపల్లె, చిప్పిలి కాలనీ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రజాసమస్యలను తెలుసుకుని అభివృద్ధి పనులకు రూ.30లక్షలతో ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

రేపు ఉపకరణాల గుర్తింపు శిబిరం

కలికిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు, వయోవృద్ధులకు సహాయపడేందుకు అవసరమైన ఉపకరణాలను అందించేందుకు శుక్రవారం గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రియాజుద్దీన్ తెలిపారు. అవసరమైన పరికరాలను ఉచితంగా అందజేయనున్నారు. భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ ఈ పరికరాలను సమకూరుస్తుందన్నారు. అవసరాలను గుర్తించడం కోసం ఈ శిబిరాన్ని ఎమ్మార్సీ కేంద్రం వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఉపకరణాలు అవసరమైన వయోవృద్ధులు, దివ్యాంగులు శిబిరానికి హాజరయ్యేటప్పుడు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్టు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం, రెండు ఫొటోలు, మొబైల్ నంబరు తీసుకురావాలని ఎంపీడీఓ కోరారు.

నేడు అంగళ్లులో...

కురబలకోట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు జడ్పీ హైస్కూల్‌లో దివ్యాంగులు, వయోవృద్ధుల అసెస్మెంట్ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, వయోవృద్ధులకు అవసరమైన సహాయ పరికరాల ఎంపిక కోసం సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు కానుగమాకులపల్లెలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కానుగమాకులపల్లెలో నేడు అభయాంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం ఉదయం సుప్రభాతసేవ, వేదపారాయణం, కళశారాధన, మహాగణపతి హోమం, నవగ్రహహోమం, మృత్యుంజయహోమం, ప్రాణప్రతిష్ఠ, ప్రతిష్ఠాపన హోమం, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, మహానైవేద్యం, బలిహరణ, మహామంగళారతి నిర్వహించనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీఐ లక్ష్మన్న బదిలీ

ములకలచెరువు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు సీఐ లక్ష్మన్నను బదిలీ చేస్తూ బుధవారం కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఐ లక్ష్మన్నను కలకడ సర్కిల్‌కు బదిలీ చేశారు. ములకలచెరువు సీఐగా తిరుపతి వీఆర్‌లో ఉన్న వెంకటేశ్వర్లును నియమించారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయం

వాల్మీకిపురం, పీలేరుల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రారంభం ●కలికిరిలో ఆస్పత్రి భవనాలు ప్రారంభం

పీలేరులో డయాలసిస్ కేంద్రానికి ప్రతిపాదనలు : ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఇందులో భాగంగా నాణ్యమైన విద్యుత్ అందించడంలో భాగంగా వాల్మీకిపురం, పీలేరు, కలికిరిల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ప్రతి మాట నిలబెట్టుకుంటానన్నారు. బుధవారం టి.సాకిరేవుపల్లెలో రూ.3.50కోట్లతో కొత్తగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రజలకు కావాల్సిన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. ఐదేళ్లలో అభివృద్ధి చేతకాని వైసీపీ నేటి పాలనపై బురద చల్లే ప్రయత్నం చేయడం, అభివృద్ధికి ఆటంకం కలిగించడమే తంతుగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. స్థానిక నేతలు, యువత ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని గజమాలలతో సత్కరించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండలాల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, చైర్మన్ చంద్రమౌళి, ట్రాన్స్‌కో అన్నమయ్య జిల్లా ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈలు శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీలు జ్ఞానేశ్వర్, శివయ్య, ఏఈలు రాజశేఖర్, చంద్రమౌళి, మండల టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు, ట్రాన్స్‌కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రానికి ప్రతిపాదనలు

కలికిరి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ.6.20 కోట్లతో నిర్మించిన 30 పడకల నూతన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పీలేరు ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం నెలకొల్పేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. పారా మిలిటరీ దళాలున్న ప్రాంగణలో మరో ఆస్పత్రి కూడా రానుందని చెప్పారు. ఆస్పత్రుల సేవల జిల్లా కోఆర్డినేటర్ (డీసీహెచ్ఎస్) డాక్టర్ ఆంజనేయులు, వైద్యాధికారి పవన్ కుమార్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ టీవీ రెడ్డి వైద్య సేవల గురించి వివరించారు. సింగిల్ విండో అధ్యక్షుడు నల్లారి చంద్రకుమార్ రెడ్డి, మాజీ సర్పంచు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాలతి, వైస్ చైర్మన్ సనావుల్లా, కలికిరి సర్పంచు ఎల్లయ్య, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి, లేపాక్షి అస్లామ్, గీత, నీటిపారుదుల సంఘం అధ్యక్షుడు రత్నశేఖర్ రెడ్డి, టీడీపీ నేతలు ఆర్టీసీ రెడ్డెప్ప రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



టి.సాకిరేవుపల్లెలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

సంక్షేమమే కొలబద్దగా...

పీలేరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సహకారంతో నియోజక వర్గాన్ని అభివృద్ధి, సంక్షేమం దిశగా పరుగులు పెట్టిస్తామని, సంక్షేమ ఫలాలు అందివ్వడం, పేదరిక నిర్మూలనే కొలబద్దగా ముందుకు పోతున్నామని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. నాయునివారిపల్లె వద్ద నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్ ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో నియోజక వర్గంలో కొత్తగా నాలుగు సబ్ స్టేషన్లు ప్రారంభించామన్నారు. ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, సింగల్‌విండో అధ్యక్షుడు వై. రెడ్డెప్పరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గోళ్ల కిషోర్ నాయుడు, దొడ్డిపల్లె టీడీపీ ఇన్‌చార్జి నారే సతీష్‌కుమార్ రెడ్డి, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చుండూరు అమర వీరులకు నివాళులు

పీలేరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చుండూరు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి మాలమహానాడు నేతలు బుధవారం నివాళులర్పించారు. మాలమహానాడు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నేతలు తుమ్మల ధరణీ కుమార్, జెట్టి మల్లికార్జున మాట్లాడుతూ 1991 ఆగస్టు 6వ తేదీన గుంటూరు జిల్లా చుండూరులోని 15 మంది మాలలపై అగ్రకుల దురంహకారులు దాడి చేసి పొట్టనబెట్టుకున్నారని గుర్తుచేసుకున్నారు. ఇంతటి అమానుష సంఘటనలో ఇప్పటికీ న్యాయం జరగలేదని, ఆ కేసులోని వారందరూ నిర్దోషులేనని తీర్పులు వచ్చాయని, అందరూ నిర్దోషులైతే మాలలను చంపిన వారెవరో ఇప్పటికైనా తేల్చాలని వారు డిమాండ్ చేశారు.

మోనూ ప్రకారం భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన తహసీల్దార్ తేజశ్వి

పెద్దమండ్యం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మోనూ ప్రకారం భోజనం పెట్టాలని పెద్దమండ్యం తహసీల్దార్ తేజశ్వి పేర్కొన్నారు. బుధవారం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలకు మధ్యాహ్న భోజనానికి అందిస్తున్న సన్న బియ్యంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతోందన్నారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికీ విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాలను ఎంఈఓ మనోహర్ తెలియజేశారు. హెచ్‌ఎం ఐఆర్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దారి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే



దారి సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కొండామరిపల్లెలో ఉన్న దారి సమస్యను ఎమ్మెల్యే షాజాన్‌బాష పరిష్కరించారు. గ్రామస్థులు దారి సమస్యపై ఇరువర్గాలు ఘర్షణ పడి గాయపడి తనవద్దకు వచ్చారన్నారు. దీంతో ఎమ్మెల్యే స్థలం వద్దకు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి దారి సమస్యలేకుండా చేశారు. వెంటనే రోడ్డు ఏర్పాటు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఆర్ బాలసుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ సుబ్రమణ్యం, టీడీపీ నేతలు షంషీర్, వేణు, సురేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే

మదనపల్లె అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఎమ్మెల్యే షాజహాన్‌బాష దగ్గర ఉండి 108 ఎక్కించి ఆస్పత్రికి తరలించారు. ఎర్రగానిమిట్ట వద్ద కారును తప్పించబోయి బుల్లెట్ అదుపు తప్పి రోడ్డుప్రమాదానికి గురైంది. ఇందులో ఇద్దరు రాజస్థాన్‌కు చెందిన వారు గాయపడ్డారు. అటుగా వెళుతున్న ఎమ్మెల్యే గమనించి క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు.

బంగారు కుటుంబాల ఎంపిక వేగవంతం చేయాలి



బంగారు కుటుంబాల ఎంపికలో ఎంపీడీఓ

నిమ్మనపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న 'పీ4'(ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం) పథకంలో అర్హులైన బంగారు కుటుంబాల ఎంపికను వేగవంతం చేయాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. రెడ్డివారి పల్లి, రాచవేటి వారి పల్లి పంచాయతీల్లో బంగారు కుటుంబాల ఎంపికను పరిశీలించారు. 15లోగా బంగారు కుటుం బాలను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రెడ్డివారి పల్లి చలిమామిడి హరిజనవాడ అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డుల ను పరిశీలించారు. కార్యదర్శి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి తహసీల్దార్ కుమార్తె




అవిజ్ఞను చేర్పిస్తున్న తహసీల్దార్, ఎంఈఓ

పెద్దమండ్యం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం తహసీల్దార్ తేజశ్వి కుమార్తె అవిజ్ఞను బుధవారం ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. తహసీల్దార్ తేజశ్వి ఇటీవల ముద్దనూరు నుంచి పెద్దమండ్యంకు బదిలీపై వచ్చారు. దీంతో చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. అవిజ్ఞకు ఎంఈఓ మనోహర్, టీచర్ గౌతమి బొమ్మలు చూపిస్తూ పాఠాలను ప్రారంభించారు. తహసీల్దార్‌ను పెద్దమండ్యం విద్యాశాఖ అభినందించినట్లు ఎంఈఓ మనోహర్ తెలిపారు.

అసంపూర్తిగా 'నాడు-నేడు'

మరమ్మతులకు నోచుకోని నీటి శుద్ధి యంత్రాలు





చెరువుకిందపల్లి పాఠశాలలో నిల్వ ఉన్న సిమెంట్ - అసంపూర్తిగా పాపేపల్లి పాథమిక పాఠశాల అదనపు గదులు

పెద్దమండ్యం, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి) వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన నాడు-నేడు పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. పాఠశాలలో మౌలి క సదుపాయాల కల్పనతో అభివృద్ధి పనులు చేపట్టింది. పనుల ప్రణాళిక, నిధులు మంజూరు దిశ నిర్దేశం లేకుండా ప్రారంభించారు. దీంతో పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా వున్నాయి. వైసీపీ నేతల స్వలాభం కోసమే అన్నట్టు పనులు సాగాయని ప్రజలు వాపోతున్నారు. నాడు-నేడు ద్వారా రెండు విడతల్లో 44 ప్రభుత్వ పాఠశాల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. సకాలంలో ఆ పనులు పూర్తి చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. దీంతో పాఠశాలల్లో పనులు ఆగిపోవడం, పాఠశాలలనే గోడౌన్‌గా మార్చి సామగ్రి ఉంచడంతో విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వెలిగల్లు, పెద్ద మండ్యం, కలిచెర్ల తెలుగు, యల్లంవారిపల్లి హైస్కూళ్లలో ప్రహరీలు అసంపూర్తిగా ఉన్నాయి. పెద్దమండ్యం పంచాయతీ పరిధిలోని చెరువుకిందపల్లి ప్రాథమిక పాఠశాలలో సకాలంలో పనులు పూర్తి కాకపోవడంతో సిమెంట్ బస్తాల్లో గడ్డలు కట్టింది. పాపేపల్లిలోని ప్రాథమిక పాఠశాల నాడు-నేడు ద్వారా చేపట్టిన అదనపు తరగతి గదులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సిద్దవరం కస్తూర్బా పాఠశాల, కలిచెర్ల తెలుగు, ఉర్దూ హైస్కూళ్లలో అదనపు తరగతి గదులు అసంపూర్తిగా వున్నాయి. మండలంలోని పాఠశాలలో పలు సమస్యలు వున్నాయని ఆయా గ్రామస్తులు వాపోయారు. పాఠశాల మంచినీరు శుద్ధి యంత్రాలు అధిక సంఖ్యలో మరమ్మతులకు గురయ్యాయని ప్రజలు వాపోతున్నారు. పాపేపల్లి పంచాయతీ వెలిగింటి వారిపల్లి, సి.గొల్లపల్లి పంచాయతీ మండ్యం దళితవాడ ప్రాథమిక పాఠశాలల్లో నాడు-నేడు పనుల ఊసే లేదని ఆ గ్రామస్తులు వివరిస్తున్నారు. మండలంలో 20 పాఠశాలల్లో నాడు-నేడు పనులు అసంపూర్తిగా ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు తెలిపారు. అకౌంట్‌లలో ఉన్న నాడు-నేడు నిధులు పాఠశాల అభివృద్ధి పనులకు వినియోగానికి కూటమి ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదని పలు పాఠశాలల చెర్మన్‌లు వాపోతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం



వాల్మీకిపురంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ భారతి - ములకలచెరువు, బి.కొత్తకోటలో తల్లులకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

వాల్మీకిపురం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయష్కరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ భారతి అన్నారు. బుధవారం పట్టణంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులకు అవగాహన చేపట్టారు. పుట్టిన బిడ్డకు గంట లోపు ముర్రుపాలు పట్టించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో...

బి.కొత్తకోట, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఐసీడీఎస్ అధికారులు అన్నారు. మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లులు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ద్వారా అందుతున్న పౌష్టికాహారం, సంక్షేమ పథకాలను వివరించారు. 7వ సెంటర్‌లో సూపర్‌వైజర్ జయరాణి, కార్యకర్తలు రమాదేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే రక్షణ

ములకలచెరువు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను ఏఎన్ఎం లలితమ్మ వివరించారు. పాత ఆస్పత్రిలో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఆశ వర్కర్లు అమరావతి, మునిరత్న, లక్ష్మీ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అమ్మపేరుతో మొక్క నాటండి

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకత్వం పిలుపు మేరకు పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకోసం, అమ్మపేరుతో మొక్క నాటాలని మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి పిలుపు నిచ్చారు. మదనపల్లె రూరల్ మండలం, పొన్నూటి పల్లె, రామిరెడ్డిగారిపల్లెలో ముత్యాలమ్మ గుడి వద్ద మండల అధ్యక్షుడు తరిగొండ వెంకటరమణా రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. అంతకముందే బీజేపీ నేతలు, మహిళలు మాజీ సీఎంకు స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, కృష్ణమూర్తి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు బొజ్జప్ప, రాయలసీమ కిసాన్ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నేతలు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ పోస్టులు కేటాయించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ పోస్టులు కేటాయించాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం ఎంఈఓకు వినతి పత్రం అందించిన యూటీఎఫ్ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం కేవలం గవర్నమెంట్, జిల్లా పరిసత్ హెచ్‌ఎంలకు మాత్రమే ఎంఈఓ పోస్టులు కేటాయిస్తోందన్నారు. అయితే మున్సిపల్ పాఠశాల్లో పని చేస్తున్నవారిపై సీతకన్ను వేసిందన్నారు. కోర్టు కేసులతో నిలిచిపోయిన మున్సిపల్ భాషా పండితులకు కూడా అడ్‌హాక్ పద్ధతిన ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో సుధాకర్, రవీంద్ర, శ్రీనప్పబాబు, కుమార్, రాము, జులాన్‌బాష, గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నేతలు